



# విజయభాను





విశాఖపట్నం, మంగళవారం 06-06-2023 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 47 సంచిక : 219 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## విశాఖ ఐటీకి చిరునామా కావాలి

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఒప్పందాల అమలుపై సీఎం సమీక్ష
- ప్రముఖ సంస్థలతో సంప్రదింపులు కొనసాగించాలని ఆదేశాలు
- ఐటీ, ఐటీ ఆధారిత సేవా రంగాలకు విశాఖ హబ్ కావాలని స్పష్టం



అమరావతి: (విజయభాను న్యూస్) : గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ఒప్పందాలు, కార్యరూపంలోకి ప్రతిపాదనలు అంశంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులతో చర్చించారు. పెట్టుబడులకు సంబంధించి మరికొన్ని వివరాలనూ అధికారులు ముఖ్యమంత్రి కి వివరించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పది సార్లు ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించి.. 59 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని అధికారులు వివరించారు. వీటి ద్వారా రూ. 3,39,959 కోట్ల పెట్టుబడులు, 2,34,378 మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయని వెల్లడించారు. 2016 నుంచి 2018 వరకూ గత ప్రభుత్వం భాగస్వామ్య సదస్సుల ద్వారా.. 1,739 ఎంఓయూలను కుదుర్చుకుంటే రూ. 18,87,058 కోట్ల పెట్టుబడులు వస్తాయని చెప్పారని.. కానీ అందులో 10 శాతం కూడా కార్యరూపం దాల్చలేదని అధికారులు.. ముఖ్యమంత్రికి వివరించారు. విశాఖపట్నంలో గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ ద్వారా 387 ఒప్పందాలు కుదుర్చుకున్నామని వెల్లడించారు. ఇందులో పరిశ్రమలు వాణిజ్య శాఖ తరఫున 100 ఒప్పందాలు కుదిరాయని.. 13 ఒప్పందాలు ఇప్పటికే వాస్తవ రూపం దాల్చాయని, రూ.2,739 కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. తద్వారా 6,858 మందికి ఉద్యోగాలు లభించాయని వివరించారు. రానున్న కాలంలో మరిన్ని కంపెనీలు పనులు మొదలు పెట్టనున్నాయని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. జనవరి 2024లోపు 38 కంపెనీలకు పనులు ప్రారంభం అవుతాయని, మార్చి 2024 లోపు మరో 30 కంపెనీలు పనులు పూర్తి చేసుకుని ఉత్పత్తిని తరువాయి 2లో..

## మెరుగైన వైద్యం అందించాలి

- రైలు ప్రమాద ఘటనలో క్షతగాత్రులకు చెక్కులు అందజేసిన మంత్రి అమర్నాథ్
- బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఒడిస్సా రైలు ప్రమాద ఘటనలో గాయపడిన, మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పారు. ఒడిస్సాలోని రైలు ప్రమాద దుర్ఘటనలో గాయపడి విశాఖలోని వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను మంత్రి అమర్నాథ్ సోమవారం అందజేశారు. బాధితులకు అందిస్తున్న చికిత్స గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించి వీలైనంత త్వరగా కోలుకునే విధంగా చూడాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మీడియాతో మాట్లాడుతూ ఈనెల రెండవ తేదీన ఒడిస్సా లోని జరిగిన రైలు ప్రమాద దుర్ఘటన ప్రపంచాన్ని కుదిపివేసిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పందించి తనతో పాటు, ముగ్గురు ఐఏఎస్, ముగ్గురు ఐపీఎస్ అధికారులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసిందని అధికారులతో తరువాయి 2లో..

## ట్రాక్టర్ బోల్తా

ఏడుగురు మహిళలు మృతి..
20 మందికి గాయాలు



వట్టిచెరుకూరు: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో విషాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్ పంటకాల్వలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో ఏడుగురు మహిళలు మృతిచెందగా.. 20 మందికి గాయాల య్యాయి. ముగ్గురు ఘటనాస్థలంలోనే మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు చనిపోయారు. ట్రాక్టర్‌లో సుమారు 40 మంది చేబ్రోలు మండలం జూపూడికి శు భకార్యానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

బాధితులను ప్రత్తిపాడు మండలం కొండెపాడు వాసులుగా గుర్తించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. మృతులను నాగమ్మ, మేరమ్మ, రత్నకుమారి, నిర్మల సుహాసిని, ఝాన్సీరాణి, సలోమిగా గుర్తించారు.

## కత్తిపూడి సభ తర్వాత వారాహి యాత్ర ప్రారంభం

పోస్టర్ విడుదల చేసిన నాదెండ్ల మనోహర్

అమరావతి, (విజయభాను న్యూస్) : ఈ నెల 14 నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి యాత్రను ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. కత్తిపూడి సభ తర్వాత వారాహి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈ మేరకు వారాహి యాత్ర గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గం లోనూ జనవాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. “పోలవరం ఎత్తు తగ్గింపుపై రాష్ట్ర ప్రభుత్వం సంతకాలు చేసింది. పోలవరానికి రూ.17,144 కోట్ల నిధులిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ప్రాజెక్టు ఎత్తును తరువాయి 4లో..

## భవిష్యత్తులో అన్ని రంగాల్లోనూ ఏపీ నంబర్-1 కావాలి

టీటీడీ ఛైర్మన్, వైవీ సుబ్బారెడ్డి

- రూ.10వేస్తే క్లాత్ బ్యాగ్ - మురుగు తీసేందుకు ప్రత్యేక వాహనం
- ప్లాస్టిక్ వ్యర్థాలపై నిఘాకు 10 వాహనాలు
- జివిఎంసి ఆధ్వర్యంలో ‘ఎకో-వైజాగ్”కు హాజరైన మేయర్, కలెక్టర్ సహా ప్రముఖులు




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్‌రోడ్డులో జివిఎంసి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ‘ఎకో-వైజాగ్’ కార్యక్రమాలు అన్ని వర్గాల్నీ ఆకట్టుకున్నాయి. పంచ సూత్రాలు అన్నట్టు ఐదు రకాలుగా విశాఖలో పచ్చదనం పెంపొందించేందుకు జివిఎంసి కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీటీడీ ఛైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లాల వైసీపీ కో-ఆర్డినేటర్ వై వీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలంటూ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున ఆధ్వర్యంలో కాళికామాత గుడి నుంచి వైఎస్సార్ విగ్రహం వరకు చేపట్టిన ర్యాలీ తరువాయి 4లో..



## మిషన్ లైఫ్ అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ది అగ్రస్థానం




వార్త 4లో



# కాలుష్యరహిత ఆంధ్ర ప్రదేశ్ కు సహకరిద్దాం

## – నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు




సీతమ్మధార (విజయభాను న్యూస్) : కాలుష్యరహిత ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దడానికి మన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి తీసుకుంటున్న అనేక విప్లవాత్మక నిర్ణయాలకు మనమందరం సహకరించి భావితరాలకు బంగారు భవిష్యత్తును అందిద్దామని విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి, వైస్ చైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్, నెడ్ క్యాప్ వారి ఆదేశాలకనుగుణంగా నెడ్ క్యాప్, విశాఖపట్నం విభాగం వారు గో ఎలక్ట్రిక్ కాంపెయిన్ ను గురుద్వారా వద్ద ఉన్న ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యుత్ ద్విచక్ర వాహన శ్రేణిలో ఏథెర్ ఎనర్జీ, ఓలా ఎలక్ట్రిక్ టెక్నాలజీస్, హీరో ఎలక్ట్రిక్ వెహికల్స్, టీవీఎస్ మోటార్స్, బూమా ఇన్నోవేటివ్ ట్రాన్స్పోర్ట్ సొల్యూషన్స్, కైనెటిక్ గ్రీన్ ఎనర్జీ & పవర్ సొల్యూషన్స్ విద్యుత్ నాలుగు చక్రాల వాహనాల శ్రేణిలో ఎంజి మోటార్స్ వంటి అనేక కంపెనీలకు చెందిన విద్యుత్ వాహనాల ప్రదర్శన ఏర్పాటు చేసి వాటి వినియోగ ఆవశ్యకత, ప్రయోజనాల గురించి సంస్థ ఉద్యోగులకు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో ముఖ్య అతిథిగా హాజరైన విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వినియోగం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని తద్వారా పెట్రోల్ దిగుబడులను, శబ్ద కాలుష్యాన్ని, శ్వాసకోశ వ్యాధులను నివారించవచ్చన్నారు. విద్యుత్ వాహనాల వాడకం వలన రవాణా ఖర్చును, దేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడమే కాకుండా ఇంధన వనరులను పొదుపు చేయడం ద్వారా దేశ ప్రగతికి తోడ్పడవచ్చన్నారు. మన రాష్ట్రంలో పెట్రోల్ /డీజిల్ ను వినియోగించే వాహనాలు సుమారు కోటి 30 లక్షలున్నాయని వీటిలో అత్యధిక భాగం ద్విచక్ర వాహనాలదేనన్నారు. వీటి వలన లక్షల టన్నుల బొగ్గు పులుసు వాయువు ప్రతీ రోజు వాతావరణంలోకి విడుదల కావడమే కాకుండా వివిధ రకాల ఆర్థిక, ఆరోగ్యకరమైన ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వీటిని




నివారించటానికి నెడ్ క్యాప్ ద్వారా గో ఎలక్ట్రిక్ కాంపెయిన్ ను అన్ని జిల్లాల్లో నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నెడ్ క్యాప్ చైర్మన్ కె కె రాజు ఈపీడీసీఎల్, నెడ్ క్యాప్ ఉన్నతాధికారులు సిబ్బంది అందరితో సాంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సాహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 14వ వార్డ్ కార్పొరేటర్ కె. అనిల్ కుమార్ రాజు, ఈపీడీసీఎల్ డైరెక్టర్లు డి.చంద్రం, ఎ.వి.వి.సూర్యప్రతాప్, సిజిఎం లు ఓ.సింహాద్రి, డి.సుమన్ కళ్యాణి, అచ్చి రవికుమార్, ఎం.రామకృష్ణ, ఈపీడీసీఎల్ సిబ్బంది, నెడ్ క్యాప్ జిల్లా నిర్వాహకులు ఎం.వి.కె.రాజు, ఫీల్డ్ ఆఫీసర్ ఎన్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




## సిపిఐ నాయకులపై అక్రమంగా పెట్టిన కేసు కొట్టివేత




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ కు పార్లమెంట్ సాక్షిగా ఇస్తామన్న ప్రత్యేక తరగతి హోదా ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ 2017 జనవరి 30వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో సీపీఐ నాయకులపై విశాఖ 2వ పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. కేసు పూర్వ పలాలు పరిశీలించిన విశాఖ 2 వ అదనపు చీఫ్ మెట్రో పొలిటిన్ కోర్టు న్యాయమూర్తి కె వి ఎల్ హిమబిందు కేసును కొట్టివేయడం జరిగింది. దీనితో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి, జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్ లీడర్ ఎ జె స్టాలిన్ లపై కేసు నెం 483/2018 నుండి విముక్తి లభించింది. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి జె వి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిస్కారం కోసం పోరాటాలు నిర్వహించిన సీపీఐ కి గణనీయమైన చరిత్ర ఉందని తెలిపారు. ఇది పార్టీ ప్రజా పోరాట విజయంగా ఆయన అభివర్ణించారు. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్ కి రాయితీలతో కూడిన ప్రత్యేక తరగతి హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## జివిఎంసిలో "జగనన్న కు చెబుదాం"కు 106 వినతులు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో మీటింగ్ హాలు నందు "జగనన్న కు చెబుదాం" కార్యక్రమంను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ "జగనన్న కు చెబుదాం" కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించగా, వాటిలో ఒకటవ జోన్ నకు 1, రెండవ జోన్ కు 8, మూడవ జోన్ కు 11, నాల్గవ జోన్ కు 7, ఐదవ జోన్ కు 10, ఆరవ జోను కు 15, ఎనిమిదవ జోన్ కు 12, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 42 ఫిర్యాదులు, మొత్తం 106 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో పరిపాలన & అక్కౌంట్స్ నకు 9, రెవెన్యూ కు 3, ప్రజారోగ్యానికి 12, టౌన్ ప్లానింగ్ కు 45, ఇంజినీరింగ్ కు 27, హార్టికల్చర్ కు 1, యుసిడికి 9 ఫిర్యాదులు అందగా, వాటిని పరిశీలించి ఆ ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న "జగనన్న కు చెబుదాం" కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరిస్తున్న వినతులు, సలహాల అంశాలపై ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యలకు సంబంధించి వివరాలతో కూడిన సమాచారంతో..., తరువాత వారం వచ్చే "జగనన్న కు చెబుదాం" కార్యక్రమానికి ముందుగా సమర్పించవలసిన వివరాలుతో ఆయా విభాగాధిపతులు సిద్ధం చేయాలని కమిషనర్ తెలిపారు. ఆయా వివరాలను తరువాత వారంలో సమర్పించడం వలన నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి వీలుగా ఉంటుందని ఆయన అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై. శ్రీనివాస రావు, డాక్టర్ వి సన్యాసి రావు, పట్టణ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ ఎన్ వి నరేష్ కుమార్, పట్టణ ప్రణాళికాధికారి బి సురేష్ కుమార్, కార్యదర్శి నల్లనయ్య, డిసి(రెవెన్యూ) ఫణిరామ్, ఎగ్జామినర్ ఆఫ్ అక్కౌంట్స్ వాసుదేవ రెడ్డి, ఎఫ్.ఎ & ఎ.ఓ మల్లికాంబ, డిపిఓ చంద్రిక, ప్రధాన ఇంజినీర్ (ఇంచార్జ్) వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజినీర్లు కెవిఎన్ రవి, వేణుగోపాల రావు, కృష్ణారావు, గోవింద రావు, రామ్మోహన్ రావు, డిపిఓ చక్రధర్, రీజనల్ ఫైర్ ఆఫీసర్ సి హెచ్ కృపావాసం, డిసిపిలు, ఎసిపిలు, యుసిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యం అందించాలి



కలిసి తాము 10 గంటల్లో ప్రమాద స్థలికి చేరుకున్నామని చెప్పారు. అధికారులు హుటాహుటిన రంగంలోకి దిగి 342 మంది ఆంధ్రప్రదేశ్ కు చెందిన బాధితులు ఉన్నారని గుర్తించారని చెప్పారు. వారిని భువనేశ్వర్ లోని వివిధ ఆసుపత్రులకు తరలించామని అమర్నాథ్ చెప్పారు. ఈ ప్రమాదంలో గురుమూర్తి అనే వ్యక్తి మాత్రమే మరణించారని, తమకున్న సమాచారం ప్రకారం పెద్దగా క్యాజువల్టీస్ ఉండకపోవచ్చన్న ఆశాభావం అమర్నాథ్ వ్యక్తం చేశారు. బాధితులకు తక్షణ సహాయం అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవను రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అభినందించారని అమర్నాథ్ తెలియజేశారు. ఈ ప్రమాదంపై మిగిలిన రాష్ట్రాలు కూడా ఏపీ ప్రభుత్వం మాదిరి స్పందించి ఉంటే, మృతదేహాలను కానీ, క్షతగాత్రులను గాని త్వరితగతిన గుర్తించి ఉండేవాళ్ళమని మంత్రి వైష్ణవ్ అభిప్రాయ పడినట్లు ఆయన చెప్పారు. ఒరిస్సాలోని వివిధ మార్చురీలలో 150 మృతదేహాలు ఉన్నాయని మరొక 24 గంటలు వేచి చూసిన తర్వాత ఈ మృతదేహాలకు సామూహిక అంత్యక్రియలు నిర్వహిస్తామని ఒడిస్సా ప్రభుత్వం ప్రకటించినట్లు మంత్రి అమర్నాథ్ వెల్లడించారు. కాగా ఇప్పటికీ మన రాష్ట్రంలోని ప్రధాన నగరాలలో కంట్రోల్ రూమ్ లు కొనసాగుతున్నాయని, అలాగే 50 అంబులెన్సు, మహాప్రస్థాన వాహనాలు భువనేశ్వర్ లో అందుబాటులో ఉంచామని ఆయన తెలియజేశారు. ఇదిలా ఉండగా ప్రమాద ఘటనకు సంబంధించి మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ, భారతీయ రైల్వేలో పటిష్టమైన సిగ్నలింగ్ వ్యవస్థ ఉండి కూడా ఇటువంటి ఘోర ప్రమాదం జరగడం దురదృష్టకరమని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సిబిఐ విచారణ ఆదేశించిన నేపథ్యంలో, ఆ ప్రక్రియను త్వరగా పూర్తిచేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు మంత్రి అమర్నాథ్ సానుభూతి తెలియజేశారు. రైలు ప్రమాదంలో గాయపడిన శ్రీకాకుళం జిల్లా రణస్థలం పాతర్లపల్లి గ్రామానికి చెందిన అలుగోలు శంకర్రావు, విశాఖకు చెందిన బి.భారతి, మాధవరావు, కే.అరుణ కే.రాజు, కే పూజకు మంత్రి అమర్నాథ్ చెక్కులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున, విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ , భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి , జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఒడిషా రైలు ప్రమాదం లో క్షతగాత్రులకు సోమవారం సాయంత్రం ఆసుపత్రులలో వారిని పరామర్శించి రాష్ట్ర ప్రభుత్వం తరపున పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్నాధ్ ఆర్థిక సహాయం అందజేశారు.

## విశాఖ ఐటీకి చిరునామా కావాలి

ప్రారంభిస్తాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ ద్వారా ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెలన్నీ ఫిబ్రవరి 2024 నాటికి పనులు ప్రారంభించేలా చూడాలని.. సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఐటీ, ఐటీ ఆధారిత సేవలు రంగాలకు విశాఖ హబ్ కావాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. దీని కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. దీని వల్ల విశాఖ నగరం ఖ్యాతి పెరుగుతుందని.. ఐటీకి చిరునామాగా మారుతుందని జగన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రముఖ సంస్థలతో సంప్రదింపులు నిరంతరం కొనసాగించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలతో పాటు.. ఇతర సంస్థలనూ విశాఖకు ఆహ్వానించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, ఇంధన శాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్, రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, మార్కెటింగ్, సహకార శాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ ప్రవీణ్ కుమార్, టూరిజం సీఈవో కన్నబాబు, ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ వీసీ అండ్ ఎండీ ఎస్.రమణా రెడ్డి, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్ర కుమార్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## కత్తిపూడి సభ తర్వాత వారాహి యాత్ర ప్రారంభం

41.15 మీటర్లకు కుదిస్తున్నట్లు చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసేలా వ్యవహరిస్తోంది. పోలవరంలో సీఎం పర్యటన దృష్ట్యా ప్రజలకు వాస్తవాలు చెప్పాలి. పోలవరం ఎత్తు ఎందుకు తగ్గించారో ప్రజలకు సీఎం చెప్పాలి" అని నాదెండ్ల డిమాండ్ చేశారు.

## బుధవారం విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ (విజయభాను న్యూస్) : జోన్ – 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు మధురవాడ సుబ స్టేషన్ పరిధి ఉడా kalani 11 కే.వి ఫీడర్ మరమ్మత్తుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మధురవాడ సబ్ స్టేషన్ ఏ.ఈ.ఈ ఎస్.వి.ఎస్.రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ జి ఓ కాలనీ, చంద్రం పాలెం, సుద్దగెడ్డ ఏరియా, వాంబే కాలనీ, పోర్ట్ కాలనీ, శ్రీనివాస్ నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించగలరని కోరారు.

## రాబోయే సార్వత్రిక ఎన్నికలలో చంద్రబాబు నాయుడు ప్రభంజనాన్ని ఏ శక్తి అడ్డుకోలేదు : పల్లా




గాజువాక (విజయభాను న్యూస్ ) : నాలుగు సంవత్సరాలుగా జగన్మోహన్ రెడ్డి అసమర్థ అవినీతిపాలన విసిగిన ప్రజలు వైకాపా ప్రభుత్వానికి ప్రజల గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని గాజువాక మాజీ శాసనసభ్యులు విశాఖ పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన మేనిఫెస్టో చూసి వైకాపా నాయకులు గుండెల్లో రైలు పరిగెడుతున్నాయని అన్నారు సోమవారం గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 70వ వార్డ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు కోయిలడ శంకర్రావు. ప్రధాన కార్యదర్శి రోమల శ్రీనివాసరావు. వార్డ్ టిడిపి నాయకులు చట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# అదానీ గంగవరం పోర్టులో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2023 వేడుక



గాజువాక (విజయభాను న్యూస్ : అదానీ గంగవరం పోర్ట్ సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. "బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్" అనే నినాదంతో పర్యావరణ సుస్థిరత యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం ఈ ప్రచారం యొక్క ప్రధాన లక్ష్యం అని తెల్పింది. కిరాణా సామాగ్రి,కూరగాయలను తీసుకెళ్లడానికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తొలగించడమే ప్రధాన లక్ష్యంగా నగరంలోని పలు స్థానిక బజార్లు,దుకాణాల్లో పునర్వినియోగించదగిన వస్త్ర, జూట్ బ్యాగులను పంపిణీ చేసింది. నగరంలో మొక్కలు నాటే కార్యక్రమం సైతం ప్రారంభించింది. ఈ కార్యక్రమం లో భాగంగా 5 సంవత్సరాలలో 1 మిలియన్ చెట్లను నాటడానికి ప్రతిజ్ఞ చేసింది. అదానీ గంగవరం పోర్ట్ తన అంతర్గత నర్సరీలో 1.5 లక్షల మొక్కలను సిద్ధం చేసిందని,ఏ జి పి ఎల్ ఏడాది పొడవునా వర్షాకాలం ప్రారంభంలో మొక్కలు నాటెందుకు మెగా డ్రైవ్ నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలిపింది. జీవీఎంసీ నిర్వహించిన "ఎకో వైజాగ్" కార్యక్రమంలో అదానీ గంగవరం పోర్ట్ లిమిటెడ్ పాల్గొని ఆర్ కె బీచ్‌లో గ్రీన్ ర్యాలీ నిర్వహించింది. ఇది ప్లాస్టిక్ ఇతర వ్యర్థ పదార్థాలను సేకరించి జివిఎంసికి అప్పగించడానికి పోర్టు సమీపంలో బీచ్ క్లీన్-అప్, రోడ్ క్లీన్-అప్ నిర్వహించింది. అదానీ గంగవరం పోర్ట్ స్థిరమైన పర్యావరణ పద్ధతులకు కట్టుబడి ఉందని, 2021 నుండి కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా ఉందని తెల్పింది. గంగవరం పోర్టు యాజమాన్యం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, సుస్థిరతకు కట్టుబడి ఉన్నామన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించడానికి, గ్రీన్ బెల్ట్‌ను మెరుగుపరచడానికి బీచ్‌లను శుభ్రం చేయడానికి తాము అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం మనకు అతి సున్నితమైన పర్యావరణ వ్యవస్థను గుర్తుచేస్తుంది, మన గ్రహాన్ని రక్షించడానికి దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన తక్షణ అవసరాన్ని గుర్తు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదానీ గంగవరం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి పర్యావరణన్ని రక్షించండి



పరవాడ, విజయభాను న్యూస్ : పరవాడ మండలం గొర్లివాని పాలెం పంచాయతీ సచివాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు సచివాలయం ఆవరణలో మొక్కలు నాటడం జరిగినది అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో మానవాళి కొనసాగాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని ఎంత తగ్గిస్తే అంత పర్యావరణాన్ని పరీక్షించడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, అడవుల నరికివేత తగ్గించాలని, వాతావరణ సమతుల్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు, సచివాలయం సిబ్బంది గ్రామ వాలంటీర్లు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆరువేల నియోగి బ్రాహ్మణ పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు



విశాఖపట్నం, విజయ భాను న్యూస్ : విశాఖ ఆరువేల నియోగి బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ రోజు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పదవ తరగతి, జూనియర్ ఇంటర్ సీనియర్ ఇంటర్ వార్షిక పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ (90% పైన) కనబర్చిన మన ఆరువేల నియోగి బ్రాహ్మణ పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు మరియు ప్రశంసాపత్రం మన కార్యవర్గం మరియు గౌరవ సభ్యులచే అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు మరియు తల్లి తండ్రులకు అభినందనలు. శుభాకాంక్షలు. ప్రతి విద్యార్థి వారి వారి నిర్దేశిత లక్ష్యం దిశగా అడుగులు వేసి మరెన్నో విజయాలు సాధించి భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా వచ్చి తీసుకోని వారికి రెండు రోజులలో ఫోన్ ద్వారా వివరాలు తెలియ చేయబడునని సంఘం సభ్యులు తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో ...

సంఘం సభ్యులు ప్రతాప్, కోటేశ్వర రావు, సత్యనారాయణ, సాగర్, విశ్వేశ్వర రావు, చంద్ర శేఖర్, నంద గోపాల్, రాధాకృష్ణ, భావరాజు, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన పేదల పక్షపాతి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



అక్కయ్యపాలెం, విజయభాను న్యూస్ : విశాఖ దక్షిణ నియోజక వర్గం 35 వార్డు పరిధిలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు సీనియర్ లీడర్ గాజుల ప్రసాద్ పిరికట్ల రాము తల్లి కలుపాకలు ప్రాంతంలో మరొక పేద కార్యకర్త చని పోయారని 35వవార్డు వైసిపి కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు తెలియజేయగా వెంటనే స్పందించిన కార్పొరేటర్ దక్షిణ నియోజవర్గ రథసారథి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కి విషయం తెలియపరచి ఆ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండాలని తెలియపరచుగా విశాఖ దక్షిణ నియోజకవర్గం రథసారథి పేదల పక్షపాతి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ వారి మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి చెంది వారి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ కుటుంబాలకు ఏ అవసరం కావాలన్నా సహాయ సహకారాలు అందించడం లో ముందు ఉంటానని తెలియజేసి వారి దగ్గరికి వెళ్లి వారి కుటుంబాలకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించి రాబోయే రోజుల్లో ఆ కుటుంబాలకి పెద్దదిక్కుగా ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమాల 35 వ వార్డు వైసిపి కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు అలాగే 35 వార్డు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు సచివాలయం కన్వీనర్లు. గృహసారథలు పాల్గొనడం జరిగింది.

# వార్డు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లిన డాక్టర్ కందుల



అక్కయ్యపాలెం, విజయభాను న్యూస్ 31, 32, 33 వార్డులో అధికారులతో కలిసి పర్యటన కొనసాగుతున్న పవనన్న ప్రజా బాట కార్యక్రమం 52వ రోజుకు చేరిన పవనన్న ప్రజా బాటప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపి తక్షణమే చర్యలు తీసుకోవాలని దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు కోరారు. నియోజకవర్గంలోని పలు వార్డులలో చాలా సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని,చాలా సార్లు స్థానిక ప్రజలు తమ సమస్యలపై విన్నవించినప్పటికీ స్పందించలేదని చెప్పారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో చేపడుతున్న పవనన్న ప్రజా బాట నిరంతరంగా కొనసాగుతుంది. శనివారం నాటికి 52వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు జివిఎంసి అధికారులతో కలిసి 31, 32, 33 పర్యటించారు. ముఖ్యంగా భీమ్ నగర్ లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. డ్వాక్రా మహిళలకు సమావేశ మందిరం, అంగన్వాడి అలాగే డ్రయన్స్, కలుషిత మంచినీరు సమస్యల పై చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలియజేశారు. వీటితో పాటు ఇక్కడ చాలా సమస్యలు పెండింగ్లో ఉన్నాయని వాటిని కూడా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమి షనర్ శివప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ కామేశ్వర రెడ్డి, కార్యకర్తలు కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవ మహా పూర్ణాహుతి, ధ్వజావరోహణం



భీమునిపట్నం. : విజయబాను న్యూస్ : శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి పంచమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి బ్రహ్మోత్సవ మహా పూర్ణాహుతి, ధ్వజావరోహణం,శ్రీవారి చక్ర స్నానం, అనంతరం మధ్యాహ్నం అన్నకూటోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగినది. శ్రీమాన్ ముప్పిరాల అనంతాచార్యుల వారు, వారి శిష్యబృందము, ఆలయ అర్చకులు శేషాచార్యులు,మనోజ్, విష్ణు వారి పర్యవేక్షణలో అతి వైభవంగా నిర్వహించారు సాయంత్రం స్వామి వారికి విశేష ఆరాధన నిర్వహించి, శ్రీ స్వామివారికి పుష్పయాగం అతి వైభవముగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమం లో ఆలయ ట్రస్టీస్ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కె ఎస్ ఎన్ మూర్తి, కె శ్రీనివాసరావు, కె వి భానోజీరావు, కె.చంద్ర శేఖర్, వి తాతాజీ, డి మురళీమోహన్ లు పాల్గొన్నారు.

# శ్రీ విశ్వేశ్వర స్వామి వారి వార్షికోత్సవాలు ముగింపు



అక్కయ్యపాలెం, విజయభాను న్యూస్ : జగదాంబ జంక్షన్ సమీపంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో గత నెల31నుండి ఈ నెల 5వ తేదీ వరకూ జరిగిన వార్షికోత్సవాలు సోమవారం సాయంత్రం నిర్వహించిన పూర్ణాహుతితో ఘనంగా ముగిసాయి. శివుని కళ్యాణం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మద్యాహ్నం భారీ అన్నదానకార్యక్రమాన్ని నిర్వహించారు. 300ల మందికి పైగా భక్తులు నారాయణసేవలో పాల్గొన్నారు. ఆలయ మేనేజర్ అడపా దేముళ్ళు వంశపారంపర్య ధర్మకర్త బాదంపూడి సూర్యకాంతం, ప్రధాన అర్చకులు రమేష్ అప్పాజీల పర్యవేక్షణలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

# నాడు -నేడు పాఠశాలలను సందర్శించిన సర్వ శిక్ష అభియాన్ ఈఈ నరసింహారావు



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : నాడు -నేడు పాఠశాలలను సందర్శించిన సర్వ శిక్ష అభియాన్ ఈఈ నరసింహారావు, మండల విద్యాశాఖాధికారిణి కె. ఎ. బాలామణి, ఏఈ మహాలక్ష్మి . పాఠశాలలు తెరిచే లోపు నాడు -నేడు పనులు జరుగుతున్న ప్రతి పాఠశాల పూర్తిగా అందుబాటులో ఉండాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు తెలియజేశారు. పనులలలో జాప్యం లేకుండా ప్రతి కాంపోనెంట్ జాగ్రత్తగా పూర్తి చేయాలని ఏదైనా అవసరమైతే ఉన్నత అధికారులకు తెలియజేయాలని చెప్పారు. అవసరమైన ప్రతిదీ తాము అందజేస్తామని నిరంతరం అందుబాటులో ఉంటామని తెలియ జేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖా ధికారణి కె.అమృత బాలామణి మాట్లాడుతూ ప్రతిరోజు "నాడు" పాఠశాలలను పర్యవేక్షిస్తున్నామని నాడు నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందరికీ అందుబాటులో ఉంటున్నామని ఉన్నతాధికారుల సందర్శన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. అన్ని కాంపోనెంట్స్ జూన్ 12వ తేదీ లోపు పూర్తి అవ్వాలని చెప్పారు. భీమునిపట్నం, తగరపువలస కు చెందిన ప్రాథమిక పాఠశాలలు మద్దిలపేట, ముద్దాడ పేట, బోడమెట్ట పాలెం, దాకమర్రి, మజ్జి పేట, విజయరామపురం, టి. నగరపాలెం, పాత పరదేశి పాలెం అలాగే అంగన్వాడి కేంద్రాలు మజ్జి వలస అంగన్వాడి కేంద్రం, తాటితూరు అంగన్వాడి కేంద్రం, లక్ష్మీపురం అంగన్వాడి కేంద్రం, అల్లు పేట అంగన్వాడి కేంద్రం అదేవిధంగా...

ఉన్నత పాఠశాలలు మజ్జి వలస, తాటితూరు తదితర పాఠశాలలో సందర్శించి పర్యవేక్షించి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచనలు ఇచ్చారు.

# పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం ఈ బోనంగి పంచాయతీలో బోద్దపువాణిపాలెం లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ కాసులు ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరిగినది. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. జీవకోటి మనుగడ కొనసాగించడానికి చెట్లు నాటే కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో నిరంతరం కొనసాగించాలన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొద్దపుశ్రీనివాస్ కాసులు. మంత్రి గిరిప్రసాద్ చందక గోవిందరాజులు. మేడశెట్టి వెంకట్రావు.బొద్దప్పు వెంకటరమణ. బోద్దపు అప్పా రావు. మేడశెట్టి రాజారావు. సచివాలయం సిబ్బంది గ్రామ వాలంటరీ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### విజ్ఞతతో వ్యవహరించాలి...

పొట్టకూటి కోసం ఉపాధి హామీ పనులు చేసే గ్రామీణ పేదలు, కౌలుదార్లు, రైతులతోబాటు ఉపాధ్యాయ, ఉద్యోగులు, పట్టణాలు పరిశుభ్రంగా ఉండేట్టు చేస్తున్న మునిసిపల్ కార్మికులు... ఇలా వివిధ వర్గాలు, తరగతులకు చెందినవారు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనలు చేపట్టవలసిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర బిజెపి ప్రభుత్వం 'ఉపాధి హామీ' నిధులకు కత్తెర వేయడం, ఫేషియల్ అటెండెన్స్, యాప్‌లతోనే మస్టర్లు, వేసవిలో సైతం రెండు పూటల పని తదితర విషమ షరతులు విధించడంతో గ్రామీణ పేదలు అల్లాడుతున్నారు. వారికి కనీస వేతనం కూడా రావడంలేదు సరికదా నీడ, నీళ్లు వంటివి కూడా లభించడంలేదు. తమ ఇబ్బందులను సర్కారు దృష్టికి తెచ్చి సమస్యలను పరిష్కరించుకోవడానికి గత రెండు వారాలుగా రాష్ట్రమంతటా ఉపాధి కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి తొలుత ప్రకటించిన విధంగా జూన్ ఒకటో తేదీన రైతు భరోసా సొమ్ము తొలి విడత జమ చేస్తూ బటన్ నొక్కడం మంచిదే. ఇది ఖరీఫ్ వ్యవసాయ పెట్టుబడులకు కొంతమేర తోడ్పడుతుంది. అయితే గత ఖరీఫ్, రబీ ధాన్యం డబ్బు రానందున ఎంతోమంది రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వాస్తవ సాగుదార్లయిన కౌలు రైతుల కష్టాలు చెప్పనలవి కాదు. వారికి రైతు భరోసా రాదు, ఇ- క్రాప్ బుకింగ్ లేదంటూ పంటను ఆర్‌బికెల్లో కొనరు, బ్యాంకులు రుణాలివ్వవు... ఇలా ఎన్నో ఈతిబాధలు. రాష్ట్రంలో కౌలు చట్టసవరణ, వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ నెల 7 నుంచి జీపు యాత్ర, పాదయాత్రలకు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం పిలుపునిచ్చింది. భూ యజమాని సంతకం వుంటేనే కౌలు అర్హత కార్డులు ఇస్తామని ప్రభుత్వం చట్టాన్ని మార్చడంతో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని, విత్తన, ఎరువుల సబ్సిడీ, పంటనష్ట పరిహారం కౌలు రైతులకే ఇచ్చేలా చట్టసవరణ చేయాలని, కేరళ తరహా రుణవిముక్తి చట్టాన్ని రాష్ట్రంలో తీసుకురావాలన్న వారి ప్రధాన డిమాండ్లు ఎంతో న్యాయమైనవి.

పట్టణాలను పరిశుభ్రంగానూ, సుందరంగానూ తీర్చిదిద్దడంలో అర్ధరాత్రి అపరాత్రి అనక కష్టం చేసే మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ఒక జాతా, శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి మరో జాతా బుధవారం ప్రారంభమయ్యాయి. సమాన పనికి సమాన వేతనం, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు, గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నవి వారి ప్రధాన డిమాండ్లు. ఇవేవీ గొంతెమ్మ కోర్కెలు కాదు. పిఆర్‌సిలో ప్రారంభ వేతనం రూ.22 వేలుంటే, మున్సిపల్ కార్మికులకు రూ.15 వేలే చెల్లిస్తోంది. ఆప్కాస్‌లో కార్మికులందరినీ ఉద్యోగులుగా నమోదు చేశారు తప్ప, సౌకర్యాలు అమలు చేయడం లేదు. ఇంజనీరింగ్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ వారికిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ఎసరు పెట్టింది. కరోనా కాలంలో మున్సిపల్ వర్కర్లను ఫ్రంట్ లైన్ వర్కర్లుగా పేర్కొన్న ప్రభుత్వం విధి నిర్వహణలో మృతి చెందిన వారికి రూ.50 లక్షల పరిహారం చెల్లించకపోవడం దారుణం. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు, ప్రభుత్వ విధానాలను, సేవలనూ ప్రజలకు చేరవేసే ఉద్యోగులూ తమ సమస్యలను పరిష్కరించాలని ఆందోళనలు చేస్తున్నారు. ఫ్యాప్టో ఆధ్వర్యాన జూన్ 5 నుంచి సెప్టెంబరు 1 వరకు పలు రూపాల్లో ఉపాధ్యాయులు ఉద్యమించనున్నారు. విద్యారంగ సంస్కరణల పేరుతో ప్రభుత్వం వేలాది ఉపాధ్యాయ పోస్టులు తగ్గించడంతోపాటు పాఠశాలల విలీనం, బోధనేతర పనులతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తోంది. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను పూర్తిగా మినహాయించాలి. ఆయా వర్గాలు, తరగతుల ప్రజానీకానికి సంబంధించిన న్యాయమైన కోర్కెలపై ఆందోళనలు చేస్తున్న వివిధ ప్రజా సంఘాలతో చర్చించి వాటిని పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత. సర్కారు విజ్ఞతతో వ్యవహరించాలి.

# మిషన్ లైఫ్ అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ ది అగ్రస్థానం

- ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2023
- చిన్న ప్రయత్నాలు సానుకూల మార్పులు తీసుకొస్తాయనేదే మిషన్ లైఫ్ ఉద్దేశం
- ప్రకృతిని కాపాడితే మన జీవితాలు మరింత మెరుగుపడతాయి.
- పర్యావరణ అనుకూల జీవనశైలి ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలి
- ప్రజల భాగస్వామ్యంతోనే కాలుష్య రహిత సమాజాన్ని సృష్టించుకుందాం
- పర్యావరణహిత కార్యక్రమాలను అమలు చేస్తున్న పలువురికి అవార్డుల ప్రదానం
- రాష్ట్ర ఇంధన, పర్యావరణ, శాస్త్ర-సాంకేతిక, అటవీ,గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



విజయవాడ(విజయభాను న్యూస్) : ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రిస్తాం, పర్యావరణాన్ని కాపాడుకుంటామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞపూనాలని పర్యావరణ దినోత్సవం-2023 సందర్భంగా రాష్ట్ర ఇంధన, పర్యావరణ, శాస్త్ర-సాంకేతిక, అటవీ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని ది వెన్యూ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను మంత్రి సందర్శించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తరువాత ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ లకు ప్రత్యామ్నాయంగా క్లాత్ తో రూపొందించిన బ్యాగ్ ను అందించే ఎనీ టైం బ్యాగ్ (ఎటిబి) వెండింగ్ మిషన్ ను మంత్రి ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వినియోగంను నివారించడం, కాలుష్యాన్ని నియంత్రించాలంటూ పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పర్యావరణహిత కార్యక్రమాలను అమలు చేస్తున్న పరిశ్రమలు, ఆస్పత్రులు, స్థానిక సంస్థలను ప్రోత్సహిస్తూ అవార్డులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, 1975 నుంచి ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా జూన్ 5వ తేదీన పర్యావరణ దినోత్సవంను జరుపుకుంటున్నామని గుర్తచేశారు. అందరిలోనూ పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు, పర్యావరణంకు ముప్పు లేని జీవన విధానంను అలవర్చుకునేందుకు ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవంను ప్రకటించిందని వివరించారు. ఈ ఏడాది ప్లాస్టిక్ వినియోగం వల్ల ఏర్పడుతున్న కాలుష్యం, దానికి పరిష్కారాలు అనే అంశంపై ప్రపంచం అంతా పర్యావరణ దినోత్సవంను జరుపుకుంటోందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గతంలో విశాఖపట్నంలో పర్యటించిన సందర్భంగాగ ప్లాస్టిక్ ఫ్లెక్సీలపై ఆంక్షలు విధిస్తూ ఆదేశాలు జారీ చేసిన విషయాన్నిమంత్రి గుర్తుచేస్తూ తిరుమలలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ను పూర్తి స్థాయిలో నిషేదించడం జరిగిందన్నారు. ఇదే మాదిరిగా పలు దేవాలయాలు, మున్సిపల్ కార్పోరేషన్లలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ను నిషేదించామని చెప్పుకొచ్చారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన మిషన్ లైఫ్ ప్రోగ్రాంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణపై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్తశుద్ధి, అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతోనే ఈ ఘనతను సాధించగలిగామన్నారు. అంతేగాక ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్రప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఆంధ్రప్రదేశ్ లో నీటి ఆదా, విద్యుత్ పొదుపు, సరైన ఆహార విధానంను అలవరుచుకోవడం, వ్యర్థాలను తగ్గించుకోవడం, స్వచ్ఛతా కార్యకలాపాల్లో పాల్గొనడం, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించుకోవడం అనే ఏడు అంశాలపై ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నామన్నారు. అంతేకాదు మిషన్ లైఫ్ ప్రోగ్రాంలో భాగంగా మన రాష్ట్రంలోని సముద్రతీరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమాన్ని 15 రోజుల పాటు ప్రజాభాగస్వామ్యంతో చేపట్టామని పేర్కొన్నారు. అలాగే అన్ని పట్టణాలు, నగరాల్లో కాలువలు, చెరువుల్లో క్లీనింగ్ కార్యక్రమాలు, పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే బైక్ ర్యాలీలు, ప్రధాన ట్రాఫిక్ కూడళ్ళ వద్ద పర్యావరణ అంశాలపై ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ పొదుపు చర్యలు, నీటి పరిరక్షణ విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. కాలుష్యరహిత విద్యుత్ ఉత్పత్తికి సీఎం జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తికి గానూ గత మార్చి 3,4 తేదీల్లో విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సుకు ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి, వారితో సౌరవిద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవగాహన కుదుర్చుకున్నామన్నారు. ఈ సదస్సులో మొత్తం రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా, రూ. 9 లక్షల కోట్లు సంప్రదాయేతర ఇంధన వనరుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి రంగంలో వచ్చాయని వివరించారు. విద్యుత్ ఉత్పత్తిలో సంప్రదాయేతర వనరులకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

దేశంలోనే మొట్టమొదటిసారి మన రాష్ట్రంలో ఘన వ్యర్థాల నిర్మూలన కోసం 'ఏపీ ఎన్విరాన్ మెంట్ మేనేజ్ మెంట్ కార్పోరేషన్' ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఘన వ్యర్థాలను సురక్షితంగా నిర్మూలన చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో తాను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా రాష్ట్రంలో జగనన్న పచ్చతోరణం కింద కోటి మొక్కలను నాటించడం జరిగిందన్నారు. వాటిని పర్యవేక్షించేందుకు కూడా నరేగా నుంచి నిధులను వినియోగించామని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద మొక్కలను తీసుకువచ్చి 16 వేల కిలోమీటర్ల పరిధిలో అవెన్యూ ప్లాంటేషన్ కింద 65 లక్షల మొక్కలను నాటడం జరిగిందన్నారు.. ప్రస్తుతం అటవీశాఖ మంత్రిగా ఈ రాష్ట్రంలోని 120 అర్బన్ ప్రాంతాల్లో నగర వనాలను ఏర్పాటు చేయడంతో పాటు ఎకో పార్క్ లను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. మన రాష్ట్రంలో 37,392 చదరపు కిలోమీటర్ల మేర అడవులు విస్తరించి ఉన్నాయి అంటే 23 శాతంగా ఉన్న అడవులను 33 శాతంకు పెంచాలనే లక్ష్యంతో సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. కమ్యూనిటీ ఫారెస్ట్ వంటి కార్యక్రమాలు, రైతులకు బీడు భూముల్లో ఉద్యానవనాల పెంపకంను ప్రోత్సహించేలా చర్యలు చేపట్టామన్నారు.రాష్ట్రంలో చాలా పరిశ్రమలు ఉన్నాయని, రెడ్, ఆరెంజ్ కేటగిరి పరిశ్రమల నుంచి సిఎస్ఆర్ నిధుల ద్వారా పచ్చదనంను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని భావిస్తున్నామన్నారు. పర్యావరణం సురక్షితంగా ఉంటేనే మానవాళితో పాటు అన్ని జంతు, జీవజాలాల మనుగడ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.పర్యావరణంను కాపాడుకోవడం, కాలుష్యాన్ని నియంత్రించుకోవడం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తించాలని కోరుకుంటున్నానన్నారు. పర్యావరణహితం కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలను ప్రతిఏటా పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నాడు సన్మానిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచానికి ఒకే భూమి ఉందని, దీనిని ప్రతి ఒక్కరూ విధిగా కాపాడుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే విషయం గుర్తుచేశారు. ఏపి పిసిబి ద్వారా గాలి, నీటి కాలుష్యంను తగ్గించుకునేందుకు పలు చర్యలు తీసుకున్నామన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ ను కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రతి జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లకు మున్సిపల్ సాలిడ్ వేస్ట్ ను జాగ్రత్తగా నిర్వీర్యం చేసేందుకు ప్రత్యేకమైన కార్యాచరణను నిర్దేశించామన్నారు. పర్యావరణంను కాపాడేందుకు బొగ్గుతో జరిగే విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయంగా సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఆలాగే పెట్రో ఇంధనంతో నడిచే వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్ వాహనాలను కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. అంతర్జాతీయంగా యుఎన్ నిర్వహించిన మిషన్ లైఫ్ లో ప్రధానమంత్రి పాల్గొని కాలుష్య కారకమైన ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించేందుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికే సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ను నిషేధించడం జరిగిందని, ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నియంత్రించడం, సరైన విధానంలో ప్లాస్టిక్ ను సేకరించి, వాటిని రీసైకిల్ చేసేందుకు తగు చర్యలు చేపట్టామని నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎపి పిసిబి ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణను వివరిస్తూ వేదికపై భాగవతుల వెంకట రామశర్మ శిష్య బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్లాస్టిక్ సంచులు వాడొద్దు..నార సంచులు, గుడ్డ సంచులు వినియోగించాలని ప్లాస్టిక్ భూతంపై పాడిన పాట, వివిధ రకాల కాలుష్యాలను వివరిస్తూ,భూమిని కాపాడుకుందాం అని పాడిన పాట, పర్యావరణం కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ రాజమహేంద్రవరానికి చెందిన విభూది దళం బ్రదర్స్ ప్రదర్శించిన బుర్రకథ ఆద్యంతం ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా పర్యావరణ హిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న పారిశ్రామిక సంస్థలు, ఆస్పత్రుల ప్రతినిధులకు, స్థానిక సంస్థలకు కలిపి మొత్తం 13 అవార్డులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేశారు. డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్, లావురుస్ లేబరేటరీస్, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్ మెంట్ లిమిటెడ్, కియా మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, భారతీ సిమెంట్స్ కార్పోరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులకు మంత్రి అవార్డులను అందజేశారు. ఆసుపత్రుల విభాగంలో విశాఖపట్నం అపోలో హాస్పిటల్స్, విజయవాడ సెంట్రల్ రైల్వే హాస్పిటల్, విజయవాడ ఆయూష్ హాస్పిటల్, సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ మెడికల్ సైన్సెస్, తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ ప్రతినిధులకు అవార్డులను అందజేశారు. అలాగే అర్బన్ లోకల్ బాడీస్ కేటగిరిలో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పోరేషన్, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్, తిరుపతి మున్సిపల్ కార్పోరేషన్ అధికారులకు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్, పిసిబి మెంబర్ సెక్రటరీ బి.శ్రీధర్, తిరుపతి మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ డాక్టర్ శిరీషా యాదవ్, జెఎన్‌టియు డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.జె. మురళీకృష్ణ, ప్రొఫెసర్ రామకృష్ణ, ఏపీ పీసీబీ మెంబర్ శివకృష్ణారెడ్డి, ఎన్విరాన్ మెంట్ చీఫ్ ఇంజనీర్ ఎన్.వి.భాస్కర్ రావు, పలువురు పారిశ్రామికవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తులో అన్ని రంగాల్లోనూ
# ఏపీ నంబర్-1 కావాలి

విజయవంతమైంది. ఈ సందర్భంగా బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన జివిఎంసి స్టాళ్ల ప్రదర్శన కూడా ఆకట్టుకుంది. రూ.10వేస్తే క్లాత్ బ్యాగ్ రావడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేసిన షూస్‌తో పాటు వివిధ రకాల వస్తు సామగ్రి(అడిడాస్, పార్లె కంపెనీల సంయుక్తంగా) సీడ్‌బాల్స్ సహా, పిచ్చుకల కోసం బౌల్స్ వంటివి ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణలో దేశ వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని అధికారులు ప్రకటించగా, సిఎం వై ఎస్ జగన్మోహన్ రెడ్డి చొరవతో దానిని ఒకటో స్థానానికి తీసుకువచ్చేందుకు అంతా ప్రయత్నించాలని వై వీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. నగర మేయర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జివిఎంసి యంత్రాంగం ఎంతో కృషి చేస్తుందన్నారు. అందరూ సమిష్టిగా కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటి కాలుష్యాన్ని అరికట్టాలని తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించగలుగుతామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ నగరం ఎంతో సుందరమైన నగరం అని ఇక్కడికి దేశ విదేశాల నుండి ఎంతోమంది పర్యాటకులు వస్తారని వారందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఇప్పటికే జివిఎంసి యంత్రాంగం ఐదు సూత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తుందని తెలిపారు. జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కాలుష్య నియంత్రణతో పాటు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిర్మూలనకు,



పర్యావరణ పై ప్రజలందరికీ అవగాహన కలిగే విధంగా పలు సంస్థలు కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. విశాఖలో కాలుష్య నియంత్రణ, తక్కువ మోతాదు కలిగిన ప్లాస్టిక్ విక్రయించేవారిపై నిఘా, పచ్చదనం పెంపు, నిబంధనలపై అవగాహన పెంచేందుకు జివిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 ప్రత్యేక వాహనాల్ని అతిథులు ఆవిష్కరించారు. అంతేకాకుండా భూగర్భ మురుగును వెలికి తీసేందుకు అత్యాధునిక సాంకేతికతో ముంబయి తరహా ఇక్కడా ఓ వాహనాన్ని అందుబాట్లోకి తెచ్చారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షిస్తా మంటూ అంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఇంటి పైనే మొక్కలు పెంచేందుకు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అవగాహన కల్పించారు. మొత్తానికి జివిఎంసి చేపట్టిన పలు కార్యక్రమాల్ని అంతా కొనియాడారు.

ఈ కార్యక్రమంలో విజయనగరం ఎం పీ బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, కార్పొరేటర్లు, వైసీపీ యూత్ అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ, విశాఖ జిల్లా జేసీ విశ్వనాథన్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, జివిఎంసి సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.



## సత్యదేవుని దర్శించుకున్న
## చోడవరం టిడిపి ఇన్చార్జ్ బత్తుల తాతయ్య బాబు



అన్నవరం, విజయభాను న్యూస్ : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారిని అనకాపల్లి జిల్లా చోడవరం నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బత్తుల.తాతయ్య బాబు దంపతులు కుటుంబ సమేతంగా శ్రీ స్వామివార్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనం అనంతరం వీరికి వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహళ మృతి

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : శనివారం అర్ధరాత్రి 12.30 సమయం లో రఘు కాలేజ్ దగ్గర ఎన్ హెచ్ 16 రోడ్ లో బొడమెట్లపాలెం దగ్గరలో సుమారు 50 ఏళ్ళ వయస్సు ఉన్న గుర్తుతెలియని మహిళను గుర్తు తెలియని వాహనం ఢీ కొని వెళ్ళిపోయిన సంఘటనలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. అయితే ఆ మహిళ ఎవరనేది ఇంతవరకు తెలియ రాలేదు. మహిళ ఆచూకి తెలిసిన వారు భీమిలి పోలీస్ స్టేషన్ 9182694835 నెంబర్ ను సంప్రదించ వెలిసిందిగా కోరారు. భీమిలి పోలీస్ స్టేషన్ సి.ఐ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఎస్.ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి ఒక్కరూ పర్యావరణ హితం కోరాలి

### పాడేరు మోదకొండమ్మ పాదాల వద్ద నక్కలపుట్ లోనూ చెత్తను సేకరించి పిలుపునిచ్చిన పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

అనంతరం మొక్కలు నాటిన భాగ్యలక్ష్మి ...





అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్..పాడేరు. ప్రతి ఒక్కరూ పర్యావరణహితాన్ని కోరాలని అదే భవిష్యత్ తరాలకు మంచిదని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి. అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పాడేరు మోదకొండమ్మ పాదాల వద్ద, నక్కల పుట్టులోనూ అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తో కలిసి పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి క్లీన్ అండ్ గ్రీన్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. అనంతరం పాడేరులోని మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లను పెంచేందుకు ప్రయత్నించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. భవిష్యత్తు అంతా పర్యావరణం కాలుష్యం ఆవరించే ప్రమాదం ఉందని దాని నుంచి తప్పించుకునేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని దానిని వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని చెప్పారు. మనం నాటే మొక్కలు భవిష్యత్ తరాలకు ఊపిరినిస్తాయని భాగ్యలక్ష్మి అన్నారు. మన ముందు తరం మనకు మంచి చేసింది కాబట్టే ఈరోజు ఎంత ఆరోగ్యంగా స్వచ్ఛమైన గాలిని తీసు కోగలుగుతున్నా మని అన్నారు. తర్వాత తరాలకి మంచి జరగాలంటే మన పరిసరాలను శుభ్రంగా ఉంచడం...

మొక్కలను పెంచే కార్యక్రమం చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సీతమ్మ, ఎంపీపీ సోనారి రత్నకుమారి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సీదరి రాంబాబు, ఎంపీటీసీ విజయలక్ష్మి, సర్పంచ్ రమణమ్మ, లక్ష్మణ్, గబ్బాడ చిట్టిబాబు, పాస్టర్ బాబురావు, ఎంపిటిసి నరసింహమూర్తి, నాయకులు కన్నాపాత్రుడు, సీనియర్ నాయకులు మంగ్లన్న దొర ఊర్వశి రాణి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ అల్లాడ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పందన కార్యక్రమంలో 6 అర్జీలు

భీమునిపట్నం, విజయభాను న్యూస్ : జివిఎంసి భీమిలి జోనల్ కార్యాలయంలోసోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంకు 6 అర్జీలు వచ్చినట్లు భీమిలి జోనల్ కమీషనర్ బి.రాము తెలిపారు. వీటిలోపట్టణ ప్రణాళిక విభాగంనకు- 3,

ఇంజనీరింగ్ విభాగానికి - 1, యుసిడి విభాగంనకు-1, రెవెన్యూ విభాగానికి 1 వచ్చినట్లు చెప్పారు. తదుపరి చర్యలకు సంబంధిత శాఖాధిపతులకు పంపడం జరిగిందనీ ఆయన అన్నారు.

## బోండా అప్పారావు మాస్టారికి నివాళులర్పించిన మాజీ మంత్రి బండారు



పరవాడ (విజయభాను న్యూస్) : భరణికము గ్రామం లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ బొండా అప్పారావు మాస్టారు ( హెడ్ మాస్టర్) కి మాజీ మంత్రి వర్యులు బండారు సత్యన్నారాయణ మూర్తి మరియు పైల జగన్నాథ రావు, మాస్టారు కి పూల మాల వేసి నివాళులు అర్పించి వారి ఆత్మ కు శాంతి చేకూరాలని ఆశిస్తూ ప్రార్థించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు), బొండా తాతారావు (మాజీ సర్పంచ్), బొండా సన్ని దేముడు (టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు), ధాట్ల గణేశ్ రాజు,ఇందల కొండల రావు (టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి), జాజుల చిన్నారావు, పెది శెట్టి రామారావు, పేది శెట్టి సత్యారావు, పెది శెట్టి సత్యారావు ( ఎల్ఐసి), మరియు కుటుంబీకులు, మరియు ప్రజలు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళకు నిత్యావసర సరుకులు పంపిణీ



భీమునిపట్నం : విజయభాను న్యూస్ : ఆదర్శ హిందీ ప్రేమీమండలి 30 వ వార్షికోత్సవం ఆదర్శ హిందీ ప్రేమీ మండలి కె.ఎస్.ఆర్ కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదర్శ హిందీ ప్రేమీమండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు చేతుల మీదుగా కృష్ణారావు మాష్టారు ఆర్థిక సహకారంతో 4 వ డివిజన్ లో స్థిర నివాసం ఉంటున్న యతిరాజు ఉష పేరుమీద వాళ్ళ అమ్మ యతిరాజు తులసి కి 10 రకాల నిత్యావసర సరుకులను పంపిణీచేశారు. అనంతరం నూకరాజు,కృష్ణారావు మాష్టర్ మాట్లాడుతూ యతిరాజు ఉష మూడు నెలల క్రితం జరిగిన ప్రమాదంలోఒక కాలు ,చెయ్యి విరిగిపోయిందనీ, ఆ కుటుంబం చాలా కష్టాలలో ఉందనీ దాతలు ఆ కుటుంబం నకు సహాయం చేయాలని కోరారు.

## కొటక్ మహేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో గోగు సంచుల పంపిణీ



రాజాం, విజయభాను న్యూస్ : మున్సిపల్ కార్యాలయం వద్ద రాజాం పట్టణానికి చెందిన కొటక్ మహేంద్ర బ్యాంకు బ్రాంచి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించింది. బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని బ్రాంచి మేనేజర్ గొర్లె శ్రీనివాసులునాయుడు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ఉద్యమంతో కొటక్ మహేంద్ర బ్యాంకు చురుకైన భూమిక పోషిస్తుందని వెల్లడించారు. ప్రజలకు అవగాహన కల్పించేలా పర్యావరణ పరిరక్షణ బోర్డులు ఏర్పాట ుచేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషినర్ డీటీవీ కృష్ణారావు చేతులుమీదుగా గోగునారతో తయారీచేసిన బ్యాగ్ లు పంపిణీచేశారు. కమిషినర్ చేతులుమీదుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషినర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ ఎంవీ నాగరాజు, బ్యాంకు అధికారులు సంతోష్, అన్నాజీరావు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్

శ్రీకాకుళం, విజయభాను న్యూస్ : పర్యావరణ పరిరక్షణను ప్రజలు తమ వ్యక్తిగత బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందని, అప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. నెహ్రూ యువకేంద్రం, యువ టూరిజం క్లబ్, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ , మెప్మా మరియు రోటరీ క్లబ్ శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం స్థానిక నెహ్రూ యువకేంద్రంలో జరిగింది.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి వ్యాఖ్య

### చిలకలగెడ్డలో అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటిన అనంతగిరి ఎంపీపీ నీలవేణి



**అనంతగిరి,విజయభాను న్యూస్ :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని జీవన ప్రమాణాలను మెరుగుపరచు కోవాలని అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి అభిప్రాయపడ్డారు .ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మండలం లోని చిలకల గడ్డ ఫారెస్ట్ డిపో వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలను నాటారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణ చేపట్టాలని ఆమె పిలుపు నిచ్చారు.ప్రతి ఒక్కరు వ్యక్తిగత బాధ్యతగా ప్లాస్టిక్ వ్యర్థాలను ఇష్టారీతిన పడవేయకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ రేంజర్ దుర్గాప్రసాద్, సిబ్బంది శ్రీహరి, సీతారాం, సత్యం ,రవి తదితరులతోపాటు కో అప్షన్ సభ్యుడు షేక్ మదీనా సర్పంచ్ జన్నిఅప్పారావు, పంచాయతీ కార్యదర్శి లావణ్య డాక్టర్ వరలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వీధి బాలలకు వస్త్రాలు పంపిణీ



భీమునిపట్నం, విజయభాను న్యూస్ : విజయభాను న్యూస్ అంతర్జాతీయంగా, దురాక్రమణకు గురైన అమాయక బాధిత పిల్లల దినోత్సవం,ప్రముఖ సామాజిక సేవకులు కీ.శే పల్లా వెంకటరావు వర్ధంతి సందర్భంగా భీమిలి లాల్ బహుదూర్ శాస్త్రి మార్కెట్ యార్డు లో పల్లా వెంకటరావు సతీమణి పల్లా సుశీలా కనకరత్నం వీధి బాలలకు,నిరుపేద పిల్లలకు వస్త్రాలు,బిస్కెట్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కాలంలో హైందవ సంస్కృతికి బదులు పాశ్చాత్య సంస్కృతి ఎక్కువయిందనీ తెలిపారు. భారతీయ హైందవ సంస్కృతిని అభివృద్ధి పరచి భావి తరాలకు అందించాలనీ కోరారు. పల్లా భరత్ కుమార్ మాట్లాడుతూ వీధి బాలలకు విద్య,ఆధార్ కార్డు నమోదు చేసేవిధంగా చొరవ చూపాలని చెప్పారు. బిజెపి జిల్లా ధార్మిక శాఖ కార్యవర్గసభ్యులు కంటుభుక్త శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం వలన అట్టడుగు బలహీనవర్గాల స్థితిగతులు అందరికీ అర్థమయ్యే అవకాశం ఉందని చెప్పారు.

ఈ మధ్యకాలంలో మత మార్పిడులు ఎక్కువ అయి హైందవ సంస్కృతి మరుగున పడే పరిస్థితి ఏర్పడుతుందనీ, హైందవ సంస్కృ తిని కాపాడాలనీ తెలిపారు. పల్లా వెంకటరావు చేసిన సేవలు మరువలేమనీ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి,పల్లా సత్యవతి, రసజ్ఞ, బాపుజమ్మ,శ్రీరాములు, సుబ్బారావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### సేవా కార్యక్రమాలకు డాక్టరేట్ అవార్డు రావడం

## సంతోషంగా ఉంది

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు అవార్డులను అందజేశారనీ, ఇందులో భాగంగా తనకు గౌరవ డాక్టరేట్ ను వైస్ చాన్సెలర్ ఎ.కె.సిన్హా చేతుల మీదుగా అందజేశారనీ వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు వెంపాడ శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా వెంపాడ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లోని తగరపువలస గ్రామంలో మొదలైన తన సామాజిక సేవా కార్యక్రమాలు ఇప్పుడు దేశ రాజధాని స్థాయిలో గుర్తింపు పొందడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ గౌరవ డాక్టరేట్ తో తన బాధ్యత మరింత పెరిగిందని, ఈ అవార్డు తన కుటుంబ సభ్యులకు, అలాగే సేవా కార్యక్రమాలలో తనతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారికి, తన సేవలకు తోడ్పాటు ఇస్తున్న వారందరికీ అంకితం అని చెప్పారు. భవిష్యత్తులో తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తృత స్థాయిలో చేపడతామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## పోష్ కమిటీ సభ్యురాలిగా కృష్ణప్రియ



కాకినాడ, విజయభాను న్యూస్ : మహిళలపై లైంగిక వేధింపుల నియంత్రణ కమిటీ (ప్రివెంటీవ్ ఆఫ్ సెక్స్యువల్ ఎరాస్మెంట్-పోష్) సభ్యురాలిగా బీర కృష్ణప్రియ నియమితులయ్యారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్కు అనుబంధంగా పనిచేసే ఈ కమిటీకి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత కర్ ఛైర్పర్సన్ గాను, మరో ఆరుగురుని సభ్యులుగా నియమించారు. ప్రభుత్వేతర సంస్థలు తరుపున ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సిఫార్సు మేరకు కల్పకం ఏచూరి మహిళా శక్తి సంఘం ప్రతినిధి కృష్ణప్రియకు అవకాశం కల్పించారు. బిటెక్ పూర్తి చేసి విద్యావంతురాలైన కృష్ణప్రియ సుదీర్ఘకాలంగా మహిళల అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారానికి వివిధ సేవా సంస్థలు ద్వారా విస్తృతసేవలు అందిస్తున్నారు. కొంతకాలంగా వైఎస్సార్ కాంగ్రెస్పార్టీలో సోషల్ మీడియా కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. పోష్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన కృష్ణప్రియ ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమెను ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కవుడ ఛైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు అభినందించారు.

# 2022-23 ఒలింపియాడ్ పరీక్ష లో అంతర్జాతీయ ర్యాంకులు సాధించిన విశాఖపట్నం విద్యార్థులు

విశాఖపట్నం: విజయభాను న్యూస్ : ఎస్ఓఎస్ ఒలింపియాడ్ పరీక్ష 2022-23లో విశాఖపట్నంకు చెందిన ముగ్గురు విద్యార్థులు అంతర్జాతీయ ర్యాంకులు సాధించారు. ప్రియాంక విద్యోదయ హైస్కూల్‌లో నాల్గవ తరగతి చదువుతున్న కందనపు హెూమచరణ్ సాయిరెడ్డి ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జ్ ఒలింపియాడ్ ర్యాంక్ 2 సాధించి ఇంటర్నేషనల్ సిల్వర్ మెడల్ మరియు మెరిట్ సర్టిఫికేట్ అందుకోగా, ప్రియాంక విద్యోదయ హైస్కూల్‌లో నాల్గవ తరగతికి చెందిన లచ్చి రెడ్డి ధక్షేష్ ఇంటర్నేషనల్ జనరల్ సాధించాడు. నాలెడ్జ్ ఒలింపియాడ్ ర్యాంక్ 3 అంతర్జాతీయ కాంస్య పతకం మరియు మెరిట్‌ను అందుకుంది మరియు శ్రీ కృష్ణ గ్రామర్ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతున్న ఎం హరిత్ జై మిత్ర, నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ 3వ ర్యాంక్ సంపాదించి, అంతర్జాతీయ కాంస్య పతకం మరియు మెరిట్ సర్టిఫికేట్‌ను అందుకున్నాడు. ఎస్ ఓ ఎఫ్ ఒలింపియాడ్ పరీక్ష 2022-23లో, 70 దేశాల నుండి సుమారు 60 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు, విశాఖపట్నం నుండి మాత్రమే 85 వేల మంది విద్యార్థులు ఉన్నారు. తిరుమల ఇంగ్లీషు మీడియం హైస్కూల్, విశాఖ వ్యాలీ స్కూల్ వంటి పాఠశాలలు పాల్గొన్నాయి. సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ 2022-2023 విద్యా సంవత్సరానికి ఒలింపియాడ్ పరీక్ష విజేతలు, ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేయడానికి ఢిల్లీలో అవార్డుల వేడుకను నిర్వహించింది. ఏడు ఒలింపియాడ్ పరీక్షల్లో పాల్గొన్న మొదటి నుండి పన్నెండు తరగతుల వరకు మొదటి మూడు %బాఖీ% ప్రపంచవ్యాప్త ర్యాంక్ విజేతలను వేడుకలో గుర్తించారు. ఈ శుభ సందర్భంగా భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 66 మంది అంతర్జాతీయ ర్యాంక్-1 విజేతలకు రూ. 50,000, అంతర్జాతీయ బంగారు పతకం మరియు మెరిట్ సర్టిఫికేట్‌తో పాటు, 66 అంతర్జాతీయ ర్యాంక్-2 విజేతలకు రూ. 25,000 అలాగే అంతర్జాతీయ రజత పతకం మరియు మెరిట్ సర్టిఫికేట్, మరియు 66 అంతర్జాతీయ ర్యాంక్-3 హెూల్డర్లకు రూ. 10,000, కాంస్య పతకం మరియు మెరిట్ సర్టిఫికేట్. పాల్గొన్న 70 దేశాల నుండి, ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 25 మంది ప్రధానోపాధ్యాయులు మరియు టాప్ 60 మంది బోధకులను కూడా నగదు బహుమతులు, సావనీర్లు మరియు ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

ఎస్ఓఎఫ్ వ్యవస్థాపకుడు మరియు డైరెక్టర్ మహబీర్ సింగ్ మాట్లాడుతూ, %బాఖీ% 25 సంవత్సరాలుగా ఒలింపియాడ్ పరీక్షలను నిర్వహిస్తోంది. ఫిబ్రవరి 22-23 మధ్య జరిగిన ఏడు ఎస్ఓఎఫ్ ఒలింపియాడ్ పరీక్షలలో 70 వేర్వేరు దేశాలలోని 1400 నగరాల నుండి 70000 పాఠశాలలు పాల్గొన్నాయి మరియు మిలియన్ల మంది విద్యార్థులు వాటి కోసం హాజరు కావడానికి నమోదు చేసుకున్నారు.

6300 పాఠశాలల నుండి 81,000 కంటే ఎక్కువ మంది విద్యార్థుల యొక్క అగ్ర రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్‌లు వారికి అవార్డులను పొందాయి. అదనంగా, దాదాపు 100,000 మంది విద్యార్థులకు వారి వ్యక్తిగత పాఠశాలల్లో అత్యధిక గ్రేడ్‌లు పొందినందుకు గోల్డ్ మెడల్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇవ్వబడింది. అదనంగా, 3000 మంది ప్రిన్సిపాల్స్ మరియు ఇన్‌స్ట్రక్టర్‌లు విద్య పట్ల అంకితభావంతో పాటు విద్యార్థుల అకడమిక్ అవగాహనను విజయవంతంగా పెంపొందించాలనే తపనతో అవార్డులు అందుకున్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత






రాజాం (విజయభాను న్యూస్) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషినర్ డీటీవీ కృష్ణారావు అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజాం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు వాటిని పెంచే బాధ్యతపై అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలనే ప్రతిజ్ఞచేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఆర్ఐలు చక్రవర్తి, రేవంత్ లు, ఎన్విరాన్ మెంట్ ఇంజినీరింగ్ అధికారిణి భాగ్యలక్ష్మి, శానిటరీ ఇనెస్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజం- పర్యావరణ హితం

## - జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్.. పాడేరు..: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని స్థానిక శ్రీ మోదకొండమ్మ పాదాల పరిసరలాలో, కిండంగి మామిడి తోటల పరిసరాలలో స్థానిక శాసన సభ్యులు కె. భాగ్యలక్ష్మి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, అటవీ, పంచాయతీ, రెవెన్యు , ఐటిడిఎ, గిరిజన సంక్షేమ, సచివాలయ శాఖల అధికారులు, సిబ్బంది తో పాటు వంతాడపల్లి, మొదపల్లి పంచాయతీల ఫరిధిలో కలక్టర్ చెత్తను తొలగించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ, దురదృష్ట వశాత్తూ ఏజన్సీ లో కూడా ప్లాస్టిక్ వినియోగం పెరిగిందని, టూరిస్టులకు కూడా అవగాహన కల్పిస్తు న్నామని చెప్పారు. సమాజంలో ఆరోగ్యకర పరిస్థితులు కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. పరిసరాలు కలుషితం కాకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, తడి పొడి చెత్తలను వేరు చేసి తద్వారా సంపద సృష్టించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగంతో ఏళ్ల తరబడి ప్రకృతి నాశనం అవుతుందని, పశు, పక్ష్యాదులకు కూడా హాని కలుగుతుందని వివరించారు. ప్రకృతిని మనం కాపాడితే, ప్రకృతి మనన్ని కాపాడుతుందని ఆ దిశగా మనం చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. శాసనసభ్యులు కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, పర్యావరణాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉందని, లేదంటే భవిష్యత్తులో పిల్లలు కలుషిత వాతావరణంలో బతకాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్త పరిచారు. ఒజోన్ పొర దెబ్బ తింటుందని, గ్లోబల్ వార్మింగ్ తగ్గించాల్సిన అవసరం ఉందని అందుకు ఎక్కువగా మొక్కలు నాతాల్సిన అవసరం ఉందన్నారు. టూరిస్టులు ఏజన్సీ లో పర్యటిస్తూ ప్రకృతి అందాలు ఆస్వాదిస్తూనే పర్యావరణానికి హాని కలిగిస్తున్నారని, వారంతా అవగాహనతో మెలగాలని రెండు చేతులు జోడించి అభ్యర్థిస్తున్నానని చెప్పారు.

మన భూమాతను ఆరోగ్యంగా ఉంచితే మన ఆరోగ్యం బాగుంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తడి పొడి డస్ట్ బిన్ ల ను పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, జిల్లా అటవీ అధికారి వినోద్ బాబు, జిల్లా పంచాయతి అధికారి కొండల రావు, డివిజినల్ పంచాయతి అధికారి వి.ఎస్. కుమార్, గిరిజన సంక్షేమ డిడి కొండల రావు, తహసిల్దార్ త్రినాధారావు నాయుడు, పలువురు, జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# కొండిబ పంచాయతీ సర్పంచ్ కప్ వాలీబాల్ టోర్నీ విజేత తైడా

**- క్రీడలతో యువతకు మానసిక ఉల్లాసం. సర్పంచ్ పంచాడి పున్నమ్మ**

**- గ్రామ సమస్యలపై యువత పూర్తి అవగాహనతో ఉండాలి**



అల్లూరి జిల్లా: అనంతగిరి, విజయభాను న్యూస్ : మండలంలో కొండిబ పంచాయతీ స్థాయిలో వాలీబాల్ టోర్నమెంట్ సర్పంచ్ పంచాడి పున్నమ్మ ఆధర్వ్యంలో కొండిబ గ్రామంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొండిబ సర్పంచ్ పంచాడి పున్నమ్మ హాజరయి టోర్నమెంటు ప్రారంభించారు. గ్రామాల వారిగా 12 జట్లు హాజరయ్యాయి. తైడా- సాడ చివరి మ్యాచ్లో తలపడగా తైడా గ్రామానికి విజయం వరించింది . రెండవ విజయం సాడా సొంతం చేసుకుంది. కార్యక్రమంలో ముఖ్య అతిదిగ విచ్చేసిన సర్పంచ్ పంచాడి పున్నమ్మ మాట్లాడుతూ యువతకు తప్పుదోవ పట్టించకుండా మంచి మంచి కార్యక్రమాలు వైపు క్రీడల వైపు మోగ్గు చూపించడం పై కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమని వార్డు మెంబర్లు కొంత రుసుపుతా కీలబోయి కొండమ్మ, గ్రామ పెద్ద మనుషులు పడాల పోతురాజు, గుజ్జల రామ్మూర్తి, అభినందించారు గుజ్జల అప్పలరాజు సచివాలయ , రెవెన్యూ , వెలుగు శాఖ అధికారులు,. గిరిజన ప్రాంతంలో అర్హత ఉన్నప్పటికీ చాలా కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాయితీలు పొందలేకపోతున్నారని , వాలీబాల్ టోర్నమెంట్ ద్వారా యువత ను ప్రోత్సహిస్తూ గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కారానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం చాలా మంచిదని తెలియజేస్తూ గ్రామస్థాయిలో సమస్యలను పంచాయితీ ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు ముందు ముందు మరిన్ని చేయాలని సర్పంచ్ కు తమ తోడ్పాటు ఎప్పుడూ అండగా ఉంటుందని తెలియజేశారు.

# ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వంగా కలిసిన కాకినాడ జిజిహెచ్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.విటల్..



కాకినాడ, విజయభాను న్యూస్ : కాకినాడ జిజిహెచ్ లో ప్రముఖ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ విటల్ ఈ మధ్యనే బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో కాకినాడ వైద్య నగర్ ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే కాకినాడ వైకాపా జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబును మర్యాదపరంగా కలుసుకుని పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు.

# 14 నుండి జిల్లాలో పవన్ వారాహి యాత్ర

## - పది రోజులు ప్రజల మధ్య...

## - పలు ప్రాంతాల్లో బహిరంగ సభలు



కాకినాడ (విజయభాను న్యూస్) : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో చేపట్టబోతున్న వారాహి యాత్ర ఈనెల 14వ తేదీ నుంచి సుమారు పది రోజులపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరుగు తుందని ఈ వారాహి యాత్రకు సంబంధించి ఉమ్మడి జనసేన పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ సోమవారం కాకినాడలోని హెలికాన్ టైమ్స్ హెూటల్లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ పవన్ యాత్ర ఈనెల 14 నుంచి 24 రోజులు వరకు సుమారు పది రోజులు పలు నియోజకవర్గాల్లో జరుగుతుందని అనంతరం ఆయా నియోజకవర్గాల్లో భారీ ఎత్తున బహిరంగ సభలను నిర్వహించి ఆయా నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై సభలో జనసేనాని ప్రసంగిస్తారని దుర్గేష్ చెప్పారు. 14న ఉదయం అన్నవరం స్వామి వారి సన్నిధిలో పూజ నిర్వహించి జనసేనని వారాహి యాత్ర ప్రారంభిస్తారని అక్కడే అదే రోజు సాయంత్రం ప్రత్తిపాడు నియోజకవర్గంలోని కత్తిపూడిలో బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. అనంతరం 15, 16వ తేదీన పిఠాపురంలోనూ, 17, 18, 19 తేదీలలో కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజకవర్గంలోనూ, అనంతరం ముమ్మిడి వరం, అమలాపురం, పి గన్నవరం, రాజోలు నియోజకవర్గంలలో జరుగుతుందని చెప్పారు. 24వ తేదీతో యాత్ర ముగుస్తుందని తెలిపారు. అక్కడ స్థానికంగా ఉన్న సమస్యలతో పాటు ఇతర ప్రజా సంఘాలు, మహిళా సంఘాల సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించి సమస్యలకు పరిష్కారం పవన్ సూచిస్తారన్నారు.

గతంలో పవన్ జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించారని ఈ కార్యక్రమానికి ప్రజల నుండి వినతి పత్రాలను తీసుకున్నారన్నారని అలాగే పవన్ నిర్వహిస్తున్న వారాహి యాత్రలకు వైకాపాలో గుబులు పుట్టిందన్నారు. వారాహి యాత్ర ప్రజల్లో మమేకమవుతుందని చెప్పారు ప్రజలతోనే ప్రజల మధ్యనే పవన్ వారాహిపై యాత్ర నిర్వహిస్తారని సీఎం జగన్ మాదిరిగా ప్రజల మధ్య లేకుండా సమస్యలు పరిష్కరించకుండా హెలికాప్టర్లో తిరుగు తున్నారంటూ దుర్గేష్ ఎద్దేవ చేశారు. బందరు కోర్టుకు మూడుసార్లు శంకుస్థాపన చేశారని అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదని దుర్గేష్ చెప్పారు. వైకాపా నాయకులు కొడాలి నాని, పేర్ని నాని, కురసాల కన్నబాబులు తమ నాయకునిపై విమర్శలు చేయడానికి తప్పా ఆయా నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలని పరిష్కరించడంలో వారు శ్రద్ధ వహించడం లేదని చెప్పారు తూర్పు సెంటిమెంటుతో జనసేన చరిత్ర సృష్టిస్తుందని దుర్గేష్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు మాకినీడు శేషు కుమారి, పితాని బాలకృష్ణ, ముత్తా శశిధర్, పంతం నానాజీ, మేడ గురుదత్త ప్రసాద్, కే కళ్యాణ్ కృష్ణ పరుపుల తమ్మయ్య బాబు, తుమ్మల బాబు, సుంకర కృష్ణవేణి, మోర్త మాలతి, మిర్యాల హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 8న కేంద్ర హెూంమంత్రి అమిత్ షా బహిరంగ సభను జయప్రదం చేయండి

## - మాజీ పీవీఎన్ మాధవ్



గాజువాక (విజయభాను న్యూస్) :ఈ నెల ఎనిమిది వ తేదీన విశాఖ లో జరగబోయే కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా బహిరంగ సభ ను విజయవంతం చేయాలనీ ఉత్తరాంధ్ర పట్ట భద్రుల మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి వి ఎస్ ఎన్ మాధవ్ అన్నారు. పాత కర్ణవాణిపాలెం బీజేపీ కార్యాలయం గాజువాక బీజేపీ కన్వినర్ కర్ణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో సోమవారం ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్బంగా మాధవ్ మాట్లాడుతూ దేశ ప్రధాని తొమ్మిది ఏళ్ల పాలన లో ప్రజలు అందరూ సంతోషం గా ఉన్నారన్నారు. దేశం లో అనేక సంస్కరణ లు చేపట్టారని అనేక సంక్షేమ పథకాలు ను కూడా ప్రవేశపెట్టారని, మహిళ లకు పెద్ద పీట వేసి వారికీ ఉన్నత స్థాయి కల్పించిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీది అని అన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ కి కూడా బీజేపీ ప్రభుత్వం అనేక ప్రాజెక్ట్ లు, పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది అని వాటి కోసం రేపు జరగబోయే బహిరంగ సభ లో ప్రజల కు వివరిస్తాం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూడా బీజేపీ ప్రభుత్వం వస్తే, అటు కేంద్రం లో, ఇటు రాష్టం లో డబల్ ఇంజిన్ పాలన తో రాష్టం మరింత అభివృద్ధి చెందుతుంది అన్నారు.

ఈ కార్యక్రమం లో దీనకొండ కృష్ణం రాజు, గుటూరు శంకరావు, బాట శ్రీను, పేర్ల సత్యారావు, ఉమ్మిడి దేముడు, పేర్ల అప్పారావు, జీలకర్ర రమణ, అప్పలరాజు ,తాతారావు, సత్తిబాబు ,ప్లీడర్ ఈశ్వరరావు ,రంజిత్ ,తాతరావు,వర్రీ లలిత, జీలకర్ర భువనేశ్వరి, స్వామి, లావణ్య, రాజశేఖర్,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కపాలభాతితో కాంతివంతమైన ఆరోగ్యం

**కపాలభాతి ప్రాణాయామం ఆడవారికి అనేక సమస్యల నుండి బయట పడటానికి చాలా సహాయపడుతుంది. ఒక నిర్దిష్ట సమయంలో అనేక భంగిమలను సాధన చేయవచ్చు. కపాలభాతి అనే పదం సంస్కృతం నుండి వచ్చింది. కపాల అంటే మస్తిష్కం అని,భాతి అంటే కాంతి లేదా మెరుపు అని అర్థం. ఈ భంగిమను అనుసరించటం ద్వారా చర్మంలో మెరుపు మరియు తాజాదనాన్ని గమనించవచ్చు.ఈ మార్పు అనేది ఒక్క రాత్రిలో రాదు. దీనిని సాధించటానికి చాలా కష్టపడాలి. యోగా వ్యాయామాలు శ్వాస నియంత్రణ మరియు సంతులనం నిర్వహణలో సహాయపడి శరీర అభివృద్ధిలో ముఖ్యమె%న పాత్రను పోషిస్తాయి. ప్రాణాయామం శ్వాసతో సంబంధం కలిగి ఆరోగ్యకరమైన శరీరం, మనస్సు, ఆత్మలను అందిస్తుంది. ఈ శక్తివంతమైన భంగిమ ప్రాధమికంగా చైతన్యాన్ని నింపటంలో సహాయపడి, వ్యవస్థకు ఒక టానిక్ వలే పనిచేస్తుంది. అందువల్ల ఈ ప్రాణాయామం వల్ల కపాలం శ్వాసలో మెరుస్తూ మంచి శ్వాస తీసుకుంటుంది. నిర్దిష్ట సమయంలో కపాలభాతి వ్యాయామాన్ని సాధన చేయటం ద్వారా కాపాలానికి మంచి శ్వాసను అందించవచ్చు.**



కపాలభాతి టెక్నిక్ నిర్వహించటానికి దశలు:

1. ఈ భంగిమను ప్రారంభించటానికి మీరు ఒక సౌకర్యవంతమైన స్థానంలో కూర్చోవాలి. అలాగే వెన్నెముకను నిటారుగా ఉంచి,ఉదరాన్ని సాధ్యమైనంత వరకు సౌకర్యవంతంగా ఉంచాలి.

2. మోకాళ్ళపై చేతులను ఉంచాలి. మోకాళ్ళ మీద అరచేతులను ఉంచాలి.

3. పొట్ట కింద బాగంలో దృష్టి పెట్టాలి. మంచి పరిపూర్ణత సాధించడానికి అరచేతులను మోకాళ్ళ మీద నుంచి పొట్ట కింద బాగంలో పెట్టి, ధ్యానం చేయాలి.

4. ఇప్పుడు ముక్కు రెండు రంధ్రాల ద్వారా లోతె%న శ్వాసను తీసుకోవాలి.

5. ఇప్పుడు అరచేతులతో పొట్టను శాంతంగా నొక్కి శ్వాసను నియంత్రించాలి.

6. గాలిని పీల్చటం ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. అందువల్ల గాలిని వదిలే క్రమం మీద దృష్టిని కేంద్రీకరించాలి.

7. మొదట 60 నుంచి 70 శ్వాసలతో ప్రారంభించాలి. ఆ తర్వాత 95 నుంచి 105 వరకు నిదానంగా పెంచుకుతూ వెళ్ళాలి. ఊపిరి అడ నట్టు అన్పిస్తే, ఆపి సాధారణ శ్వాస తీసుకోని మరల ప్రారంభించ వచ్చు.

8. ఈ ఆసనం వేసేటప్పుడు నోరు,ముక్కు రెండు అవయవాలు పనిచే స్తాయి. ముక్కు గాలి పీల్చుకోవటానికి మరియు నోరు గాలిని వదల టానికి సహాయపడుతుంది. ప్రతి రోజు 15 నుంచి 20 నిమిషాల పాటు చేస్తే మంచి పలితం కనపడుతుంది.

ఈ ఆసనం వలన కలిగే ఇతర ప్రయోజనాలు: సైనస్ ,ఊపిరితిత్తులు మరియు శ్వాస వ్యవస్థను శుభ్రం చేయడానికి సహాయపడుతుంది. అలెర్జీలకు వ్యతిరేకంగా పోరాడటానికి అవసరమె%న శక్తిని ఇస్తుంది. ఉదర కండరాలు మరియు డయాఫ్రాగమ్ కు శక్తినిస్తుంది.

ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది. పునరుత్పత్తి వ్యవస్థ పనితీరును క్రమపరుస్తుంది. జాగ్రత్తలు గుండె సమస్యలు,ఉబ్బసం, అధిక రక్తపోటు, హెర్నియా ఉన్నవారు మరియు గర్భిణీ స్త్రీలు ఈ ఆసనానికి దూరంగా ఉండటం మంచిది. ఈ భం గిమ ఆరోగ్యకరమైన జన నేంద్రియ వ్యవస్థకు అద్భు తంగా పనిచేస్తుంది. పున రుత్పత్తి కోసం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ భంగిమలను పుస్త కాల్లో చదివి లేదా ఫోటోలను చూసి చేయకూడదు. గురువు దగ్గర నేర్చుకొని మాత్రమే చేయాలి.

# ఆహారంతో ఆరోగ్యం



ఆహారంలో ప్రొటీనల్ల తక్కువగా ఉంటే ఆకలి ఎక్కువగా అవుతుంది. 20 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం చేసే వారితో పోలిస్తే 15 శాతం ప్రొటీన్లు ఉన్న భోజనం తీసుకునే వారు ఒక రోజులో 260 క్యాలరీలు ఎక్కువగా తీసుకుంటారు. 70 శాతం అదనపు క్యాలరీలు మనం రోజూ తినే చిరు తిండ్లతోనే సమకూరుతుంది. సంవత్సరం గడిచే సరికి సుమారు ఐదు నుంచి ఎనిమిది కిలోల బరువు కూడా పెరుగుతాము. దీన్ని నివారించాలంటే మాంసం, చేపలు, కోడిగుడ్ల వంటి ఆహారాన్ని సాధారణంగా తీసుకునే దాని కన్నా ఎక్కువగా తీసుకోవాలి. మనం తీసుకునే ఆహారంలో ప్రొటీన్ల నిష్పత్తి తగ్గితే ఆకలి పెరుగుతుంది. తద్వారా ఇంకా తింటాం. దీంతో శరీరంలో కెలరీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆహారాన్ని స్వీకరించడంలో సమతుల్యత, వైవిధ్యం, మితంగా వ్యవహరించడం అనేవి ఆరోగ్యకరమైన అలవాటు. అలా అని ఒకేసారి తినేదాని కంటే అధికంగా పట్టించినా ఇబ్బందే. ఒక్కసారే ఎక్కువ మొత్తంలో తినేకంటే రోజులో ఎక్కువసార్లు కొద్దికొద్దిగా తినడమే ఆరోగ్యకరమని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ క్యాలరీలు పొందకుండా, ఒకే దానిని అతిగా స్వీకరించకుండా అనేక రకాలు ఆహర పదార్థాలను కొంచెంగా తీసుకోవడం మంచిది. పోషక పదార్థాలు అధికంగా ఉండే వివిధ రకాల ఆహార పదార్థాలను తీసుకోండి. ఈ లెక్కన మంచి ఆరోగ్యం కోసం వైవిధ్యమైన 30 నుంచి 35 రకాల పోషక పదార్థాలను తీసుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క ఆహారం కూడా అన్నింటినీ అందించదు. మీ దినసరి ఆహార ఎంపికలో పప్పు ధాన్యాలతో చేసిన పదార్థాలు, పండ్లు, కూరగాయలు, పాల పదార్థాలు, మాంసం, చేపలు ఉండేలా చూసుకోవాలి. దీని కోసం టైం టేబుల్‌ను తయారు చేసుకుని దాన్ని పాటించాలి. రోజు ఎన్ని కెలరీలను ఖర్చు చేయగలమో అంత మోతాదులోనే ఆహారం తీసుకోవాలి. ధాన్యాలు, పండ్లు, పప్పులు, కూరగాయలను అధికంగా తీసుకోండి. పచ్చి కూరగాయలు తీసుకుంటే పోషకాలు నేరుగా అందుతాయి. అన్నంలో, చపాతీల్లో కూర ఎక్కువ తినాలి. రోజు ఎంత తినాలి? అనే విషయంలో మన చేసే పని, ఎత్తు, ప్రస్తుత బరువు, వయస్సు, స్త్రీ, పురుషుడు ఇలా పలు లక్షణాలను అంచనా వేయాల్సి ఉంటుంది. అధిక బరువు శరీరానికి చేటు చేస్తుంది. ఎత్తుకు సరిపోయేలా బరువు వుంటే చాలు. ఈ విషయంలో వైద్యుడిని సంప్రదించి సలహా తీసుకోండి. మితాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు.

# పిల్లలపై న్యుమోనియా నీడలు



పిల్లలపై న్యుమోనియా నీడలు కమ్ముకుంటున్నాయి. కరోనాకు చలి ప్రభావం తోడవ్వడంతో ఈ వ్యాధి చిన్నారులను గడగడలాడిస్తున్నది. ముఖ్యంగా ఈసారి చలితీవ్రత అధికంగా ఉండటంతో పిల్లల్లో ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు పెరుగుతున్నట్లు నిలోఫర్ చిన్నపిల్లల విభాగాధిపతి ప్రొఫెసర్ ఉషారాణి తెలిపారు. చలి పులి పంజా విసురుతున్నది. చిన్న పిల్లలను న్యుమోనియా వెంటాడుతున్నది. కరోనాకు చలి ప్రభావం తోడవ్వడంతో న్యుమోనియా కోరలు సాచుతున్నది. ఇప్పటికే నగరంలో 30శాతం మంది చిన్నారులను ఈ వ్యాధి వెంటాడుతున్నది. ప్రతిరోజు నిలోఫర్ దవాఖానకు దాదాపు 80మంది చిన్నారులు న్యుమోనియాతో బాధపడుతూ చికిత్స నిమిత్తం వస్తున్నారు. కేవలం నిలోఫర్ లోనే ఇలా ఉంటే నగర వ్యాప్తంగా ఉన్న దవాఖానల్లో కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి. అయితే తల్లిదండ్రులు వ్యాధి తీవ్రత ముదరక ముందే వైద్యులను సంప్రదించాలని, నిర్లక్ష్యం చేస్తే పిల్లల ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరిస్తున్నారు. తల్లిపాలతో న్యుమోనియాను అడ్డుకోవచ్చని సూచిస్తునా

పిల్లలకు సంబంధించిన వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైనది న్యుమోనియానే అని, దీనివల్లనే 5 ఏండ్లలోపు పిల్లల్లో మరణాల రేటు అధికంగా ఉంటుందన్నారు. ఈ వ్యాధి వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 2.5 మిలియన్ల మంది పిల్లలు మృత్యువాత పడుతున్నారని డబ్ల్యూహెచ్ఓ గణాంకాల ద్వారా తెలుస్తున్నది. గ్రేటర్‌లో 30శాతం మంది పిల్లలు ఈ న్యుమోనియా వ్యాధితో బాధపడుతున్నట్లు ఐఏపీ(ఇండియన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్)వర్గాలు చెబుతున్నాయి. నగరంలోని నిలోఫర్ దవాఖానకు ప్రతిరోజు ఓపీ కోసం సుమారు 500మంది రోగులు వస్తే వారిలో 50నుంచి 80కేసులు న్యుమోనియాకు సంబంధించి ఉంటున్నట్లు నిలోఫర్ ఓపీడీ ఇన్‌చార్జి, ఆర్ఎంఓ డాక్టర్ రమేశ్ దాంపురి తెలిపారు. వీరిలో రోజుకు సుమారు 10నుంచి 12మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స అందిస్తుండగా, మిగిలిన వారికి ఓపీలో చికిత్స అందించడం జరుగుతుందన్నారు.

ఇది కేవలం నిలోఫర్ దవాఖానకు సంబంధించిన లెక్కలు మాత్రమేనని తెలిపారు. ఇక చిన్నపిల్లలకు సంబంధించిన క్లీనిక్‌లు, దవాఖానల్లో ఈ కేసులు అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది. అమెరికా వంటి దేశాల్లో ఇన్‌ఫ్లుయంజా, రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్‌సీవీ)వంటి వైరస్‌లతో న్యుమోనియా సంక్రమిస్తే మన దేశంలో ట్యూబర్‌కిలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా ఎక్కువ సంక్రమిస్తుందని వైద్యులు తెలిపారు. పిల్లల్లో న్యుమోనియా వ్యాధిని సకాలంలో గుర్తించకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగి ప్రమాదస్థాయికి చేరుకుంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధిపై ప్రజల్లో అవగాహణ లేకపోవడంతో రోగుల సంఖ్య, మరణాల సంఖ్య అధికంగా ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 2009 నుంచి ప్రతి ఏటా నవంబర్ 12న ప్రపంచ న్యుమోనియా దినంగా పరిగణిస్తున్నారు.

**ఎలా సోకుతుంది?**

బ్యాక్టీరియా, ఫంగస్, వైరస్‌లతో పాటు ఇన్‌ఫ్లూయెంజా, రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్‌సీవీ)ల వల్ల న్యుమోనియా వ్యాధి సోకుతుంది. స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియాతో కూడా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. న్యుమోనియాలో రెండు రకాలు ఉన్నాయి.

1. బ్యాక్టీరియాతో వచ్చే న్యుమోనియా 2. వైరల్ ఇన్ఫెక్షన్స్. అంటే సమాజంలో కలిగే మార్పుల వల్ల వచ్చే న్యుమోనియా. దీన్ని కమ్యూనిటీ అక్వైర్డ్ న్యుమోనియా అంటారు. వాతావరణంలో కలిగే మార్పులు, ఇన్ఫెక్షన్‌ల వల్ల వస్తుంది. దవాఖానల్లోని ఇన్ఫెక్షన్‌ల వల్ల వచ్చే న్యుమోనియాను హెల్త్‌కేర్ అసోసియేటెడ్ న్యుమోనియా అంటారు. ఇది దవాఖానల్లో చేరినప్పుడు అక్కడి ఇన్ఫెక్షన్‌లు లేదా ఇన్‌ఫ్లుయంజాతో బాధపడే వారి నుంచి సోకుతుంది. ముఖ్యంగా 5సంవత్సరాల లోపు పిల్లలకు, హెచ్‌ఐవీతో బాధపడే పిల్లలకు ఈ వ్యాధి సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిలోఫర్ వైద్యులు తెలిపారు.

**వ్యాధి లక్షణాలు** నిమిషానికి 30సార్లకంటే ఎక్కువసార్లు శ్వాస తీసుకోవడం

పొత్తికడుపు, ఛాతిలో నొప్పి

నోటి చుట్టూ చర్మం

నీలిరంగుకు మారడం

పక్కలు ఎగేయడం%అ% ఆయాసం

తీవ్రమైన జ్వరం

ఊపిరి పీల్చుకోవడంలో అస్వస్థత

దగ్గు

న్యుమోనియాను అడ్డుకునే వ్యాక్సిన్‌లు ఇవే

బీసీజీ

పెంటావ్యాక్

హిబ్

న్యుమోకోకల్

మిజిల్స్

ఫ్లూ షాట్

65 ఏండ్లు దాటిన వారికి ప్రమాదమే..

ప్రపంచంలో శిశువులు, వృద్ధుల మరణాలకు పెద్ద ఎత్తున కారణమవుతున్న అతి పెద్ద సంక్రమిత వ్యాధుల్లో న్యుమోనియా ఒకటి. ఊపిరితిత్తుల్లో నీరు చేరి బాధితులకు ఊపిరందని పరిస్థితి తలెత్తుతుంది. 65ఏండ్ల వయస్సు దాటిన వారికి రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల ముప్పు అధికంగా ఉంటుంది. పొగాకు, మద్యం సేవించే వారు చలి కాలంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే పూర్తి స్థాయి చికిత్స అందుబాటులో ఉంది. - డాక్టర్ రఘుకాంత్, పల్మనాజిస్టు, మెడికవర్ ఆస్పత్రి.

తల్లిపాలతో న్యుమోనియాను అడ్డుకోవచ్చు

సాధారణంగా తల్లిపాలతో బిడ్డలో రోగ నిరోధక శక్తి స్వతహాగా పెరుగుతుంది. తల్లిపాలు తాగిన పిల్లల్లో న్యుమోనియాను ఆరుసార్లు అడ్డుకునే శక్తి శిశువులో ఉంటుంది.

ప్రభుత్వం టీకాలను పిల్లలకు పూర్తి ఉచితంగానే ఇస్తుంది. వ్యాక్సినేషన్ 80శాతం దాటితే న్యుమోనియా బారినుంచి పిల్లలను కాపాడుకోవచ్చు. చల్లగాలి, పొగ, పెద్దవారిలో ఉన్న ఇన్ఫెక్షన్స్ ద్వారా పిల్లలకు న్యుమోనియా సోకుతుంది. 5 ఏండ్లలోపు వయస్సుగల పిల్లల్లో మరణాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. గతంలో ప్రధానిని కలిసినప్పుడు న్యుమోకోకల్‌ను ప్రభుత్వ టీకా షెడ్యూల్‌లో చేర్చాలని కోరాను. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రారంభదశలోనే హాస్పిటల్‌కు తీసుకువస్తే 99శాతం నయం చేయవచ్చు. ఆలస్యమైతే ప్రమాదం.

# దైవారాధనలో రాగి పాత్ర

ఈ రోజుల్లో కూడా పూజాది కార్యక్రమాలకి వెండి, బంగారు పాత్రలు ఉపయోగించే వారు లేకపోలేదు. అయితే ఒకప్పటికంటే ఇప్పుడు అలాంటివారి సంఖ్య తగ్గిందనే చెప్పాలి. ఇక మధ్యతరగతి వారు కూడా ఇత్తడి - రాగి పాత్రలను వాడటం చాలావరకు తగ్గించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎవరి ఇంట్లో చూసినా స్టీలు పాత్రలే దర్శనమిస్తున్నాయి. పూజకి ఉపయోగించే అన్ని రకాల పాత్రలు నేడు స్టీలులోనే కనిపిస్తున్నాయి. నగిషీ కారణంగా స్టీలు ... ఇనుము అనే భావన కలగనీయదు. ఈ కారణంగానే దీని వాడకం అంతకంతకూ పెరుగుతూపోతోంది.అయితే ఇటు ఆరోగ్యపరంగాను ... అటు ఆధ్యాత్మిక పరంగాను స్టీలు పాత్రలను వాడకూడదని శాస్త్రం చెబుతోంది.

**పూజలకు స్టీల్ పనికిరాదు:**

స్తోమత వుంటే వెండి - బంగారం, లేదంటే ఇత్తడి - రాగి పాత్రలను వాడటమే అన్ని విధాలా మంచిదని చెబుతోంది. స్టీలు ( ఇనుము) శని సంబంధమైన లోహం కనుక, దానికి బదులుగా ఇతరలోహాలతో చేసిన పాత్రలను మాత్రమే పూజకు వాడాలనీ, అప్పుడే ఎలాంటి దోషాలు లేని పరిపూర్ణమైన ఫలితాలను పొందవచ్చని స్పష్టం చేస్తోంది.

**రాగితో ఆరోగ్యం బోలెడు:**

గతంలో రాగి చెంబు, రాగి బిందె, రాగి గ్లాసు, రాగి ప్లేటు ఇలా ఎక్కువగా రాగి వస్తువులనే వాడే వారు. కాని నేడు ఫ్యాషన్ ఎక్కువయ్యి ప్లాస్టిక్ వచ్చిపడింది. దాంతో రాగి పాత్రల వాడకం బాగా తగ్గిపోయింది. నీళ్ళు తాగాలంటే ప్లాస్టిక్ బాటిల్స్, లంచ్ బాక్సులు కూడా ప్లాస్టికే. నేటి ఇళ్ళు మొత్తం ప్లాస్టిక్ సామానుల మయమైపోయాయి. అయితే రాగి పాత్రలు వాడడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

రాగిలో యాంటి బ్యాక్టిరియల్ నేచర్ ఉంటుంది. రాగితో చేసిన పాత్రలలో సూక్ష్మ క్రిములు చేరే అవకాశం ఉండదు. కాబట్టి ఇందులో నిల్వచేసే పదార్థాలు చెడిపోయే అవకాశాలు చాలా తక్కువ. మనకి వచ్చే చాలా రోగాలకి నీటి కాలుష్యం ముఖ్యమైన కారణం. రాగి పాత్రలలో నీళ్ళు ఉంచితే అందులో క్రిములు చేరే అవకాశం చాలా అరుదు. అందుకే పాత రోజుల్లో రాగి బిందెలు వాడేవారు.

చెవులు కుట్టినప్పుడు కూడా చిన్న పిల్లలకి కొన్ని చోట్ల మొదటిసారి రాగి తీగలు చుడతారు. ఎందుకంటే పుండు పడకుండా ఉండటానికి. రాగికి వున్న ఆంటి బ్యాక్టిరియల్ లక్షణం పిల్లలకు ఆ ప్రమాదం రాకుండా చేస్తుంది.

గతంలో నీళ్ళు వేడి చేసుకోవడానికి రాగితో చేసిన బాయిలర్లు వాడే వాళ్ళు. ఇందులో వేడి చేసిన నీరు వాడడం వల్ల చర్మ సంబంధిత రోగాలు కూడా తగ్గేవని రుజువు చెయ్యబడ్డాయి.

రాగి చెంబులో రాత్రి నీరు వుంచి పగలు నిద్ర లేవగానే తాగితే చాలా చాలా మంచిది. అలా తాగితే కడు పులో వున్న చెడు అంతా మూత్రం ద్వారా బయటకి వచ్చేస్తుందట. ఈ అలవాటు వల్ల గ్యాస్, కిడ్నీ, లివర్ సమస్యలు కూడా తగ్గిపోతాయి. బ్రిటిష్‌కి చెందిన ఒక యూనివర్సిటీ వాళ్ళు కూడా రాగిపాత్రలలో ఉంచిన నీటిపై పరిశోధన జరిపి పైన పేర్కొన్న విషయాలు నిజమని నిరూపించారు.

**పరగడుపున రాగి పాత్రలో నీళ్లు:**

రాత్రి రాగి చెంబులో మంచి నీళ్ళు వుంచి పరగడుపున తాగితే హాయిగా జీవించవచ్చు. రాత్రి నిద్ర పోయేముందు అర లీటర్ నుండి లీటర్ ఉండే రాగి చెంబు నిండా మంచినీళ్ళు పోసి మంచం పక్కనే పెట్టుకోవాలి ఉదయం నిద్ర లేచి లేవగానే రెండు సార్లు పుక్కిలించి ఊసి ఆ రాగి చెంబులోని నీళ్ల తాగాలి . దీనివల్ల 15 నిమిషాల నుండి అర గంటలోపు సుఖ విరోచనం అవుతుంది. గ్యాస్, కడుపుబ్బరము, కడుపులో మంట, మలబద్ధకం, తేపులు, మొదలైన బాధలన్నీ ఈ అలవాటుతో ఎటువంటి ఔషదాలు వాడే పని లేకుండా పూర్తిగా తగ్గిపోతాయి.

# కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదాం

## - నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి

విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** కాలుష్య రహిత నగరంగా విశాఖ ను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నగరమే గొలగాని హరి వెంకట కుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉడా చిల్డ్రన్ ఎరేనా థియేటర్ లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పర్యావరణ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ కాలుష్యరాహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని, ఇప్పటికే జివిఎంసి కాలుష్య నియంత్రణకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని ముఖ్యంగా ఐదు సూత్రాలు ఉపయోగించి






కాలుష్య నియంత్రణకు కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. "ఇకో-వైజాగ్" అనే కార్యక్రమం నేడు ఆర్కే బీచ్ లో జివిఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కొరకు విద్యార్థి దశ నుండే అవగాహన కల్పించి వారిని చైతన్యవంతం చేయాలని తెలిపారు. అనంతరం పర్యావరణ పురస్కరించుకొని చిత్రలేఖనం లాంటి పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు సాధిక్, జాయింట్ చీఫ్ మేనేజ్మెంట్ ఇంజనీర్ ప్రసాద్ రావు, డాక్టర్ వరలక్ష్మి, వెంకట శేషమ్మ, ఆంధ్ర యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ ఈయుబి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విశాఖపట్నం పోర్టు అధారిటీ నూతన చైర్పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం అంగముత్తు, ఐఏఎస్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

# విశాఖ పోర్టులో ఘనంగా అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం




విశాఖపట్నం (విజయభాను న్యూస్): అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని విశాఖపట్నం పోర్టులో ఘనంగా నిర్వహించారు. పోర్టు పరిపాలన భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పోర్టు డిప్యూటీ చైర్మన్ మాట్లాడుతూ బీట్ ద ప్లాస్టిక్ - "సొల్యూషన్ టు ది ప్లాస్టిక్ పొల్యూషన్" అనే థీమ్ తో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ భూతం మనిషి జీవితం పైన అన్ని సందర్భాలలోనూ చెడు ప్రభావాన్ని చూపుతోందని దీని నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని కచ్చితంగా నిషేధించాలని ఆయన పిలుపునిచ్చారు. విశాఖపట్నం పోర్టులో కేవలం ప్లాస్టిక్ పొల్యూషన్ ను మాత్రమే కాకుండా గాలి కాలుష్యం, నీటి కాలుష్యం, ధూళి కాలుష్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ చైర్మన్ వెల్లడించారు. విశాఖపట్నం పోర్టు అధికారులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఇదే విషయాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని డిప్యూటీ చైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్ ఎల్ స్వామి, పర్యావరణ కమిటీ మెంబర్ బిఎల్ శాస్త్రి, చీఫ్ ఇంజనీర్ వేణు ప్రసాదులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోర్టు పరిపాలనా భవనంలో అధికారులు మొక్కలను నాటారు.

# ఎన్ఆర్ఎఫ్ ర్యాకింగ్ ఏయూకు 43వ స్థానం




ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్) :** జాతీయ స్థాయిలో కేంద్ర విద్య మంత్రిత్వ శాఖ అందించే నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) 2023 ఇండియా ర్యాకింగ్స్ను విడుదల చేసారు. జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయాల విభాగంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం 43వ స్థానాన్ని సాధించింది, ఏయూ ఫార్మసీ కళాశాల 22వ స్థానాన్ని, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల 94వ స్థానాన్ని సాధించాయి. నూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ ర్యాంకింగ్లను ప్రకటించారని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్ తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో రాష్ట్రంలో ఏయూ ప్రథమ స్థానంలో నిలచింది. దేశ వ్యాప్తంగా 2478 విద్యసంస్థలు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్లలో భాగం కాగా ఏయూ కేంద్ర విశ్వవిద్యాలయాలతో పోటీ పడి అత్యుత్తమ స్థానాలను సాధించింది. గత నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభివృద్ధి చేసిన విధానం అత్యుత్తమ ర్యాంకుల సాధనకు ఎంతగానో ఉపయుక్తంగా నిలచింది.

ఎస్ఐఆర్ఎఫ్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్స్ విభాగంలో తొలి సంవత్సరంలోనే ఆంధ్రవిశ్వవిద్యాలయం 11-50బ్యాండ్లో స్థానం సాధించింది.

ఏయూలో ఆహబ్ ప్రారంభించిన తొలి సంవత్సరంలోనే ఇన్నోవేషన్ రంగంలో ఇటువంటి అత్యుత్తమ స్థానాన్ని ఏయూ సాధించింది. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో నాక్ చైర్మన్ సహస్రబుద్దే నుంచి ఎస్ఐఆర్ఎఫ్ ర్యాకింగ్ ధృవపత్రాలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ స్వీకరించారు.

# ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి వాలంటరీ వ్యవస్థ

## ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు




మాధవధార (విజయభాను న్యూస్) : ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి వాలంటరీ వ్యవస్థ అని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు అన్నారు. ఈ మేరకు మాధవస్వామి కళ్యాణ మండపంలో జోన్-5 ఆధ్వర్యంలో 48,49, 50,51 వార్డుకు సంబంధించిన వాలంటరీలకు సేవా మిత్ర,సేవారత్న,సేవా వజ్ర పురస్కారాల ప్రదానోత్సవం చేసారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర ఎంపికైన వాలంటీర్లను శాలువాతో సత్కరించి వారికి అవార్డు ప్రదానం చేసి సర్టిఫికెట్ లను అందజేశారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ నిరుపేద లకు తక్షణ సహాయం అందే విధంగా ప్రభుత్వ పథకాలు ప్రజలు ముంగిట చేరే విధంగా ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి వార్డు వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేశారని అన్నారు. ఈ వార్డు వాలంటీరి వ్యవస్థ ద్వారా రోజుల వ్యవధిలోనే పలు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం జరిగిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర రావు,కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్,రెయ్యి వెంకట రమణ, వార్డు అధ్యక్షులు నీలి రవి,పి.సునీత,డైరెక్టర్లు యన్.రవి కుమార్,పైడి శ్రీను,ఐ.రవికుమార్, జేసీఏస్ మండల కన్వీనర్ కృష్ణారావు మాస్టర్,ఏపీడీ శైలజ,సీనియర్ నాయకులు భగాతి విజయ్ కుమార్, కర్రి రామారెడ్డి,పైడి ప్రతాప్,ఆదిరెడ్డి శ్రీను, చంద్రమౌళి,పాతపట్నం రాం మోహన్, అప్పరావుమాస్టార్, తిరుమలరావు, రత్నం, బద్రి,మున్నా, శంకర్, శ్యామ్, వినోద్,శివాజి, దనుంజయ్, సచివాలయం కన్వీనర్లు సచివాలయం సిబ్బంది, ఆర్.పి లు,వాలంటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆటోలో మేయర్, సైకిల్ పై కమిషనర్





విశాఖపట్నం,(విజయభాను న్యూస్) : విధులలో భాగంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ సి ఎం సాయికాంత్ వర్మ కాలుష్య నియంత్రణలో భాగంగా ప్రతి సోమవారం తమ సొంత వాహనాలను వదిలి, ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగిస్తూ పలువురి ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం మేయర్ ఆరిలోవలోని తమ క్యాంపు కార్యాలయం నుండి ఆటోలో ప్రయానించగా, జివిఎంసి కమిషనర్ సైకిల్ పై కార్యలయంనకు చేరి వారివారి విధులలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి ఇరువురూ మాట్లాడుతూ, నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని వాటి నియంత్రణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, నగరంలో ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల యజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజారవాణాను వారి సిబ్బంది ఉపయోగించేలా చూడాలన్నారు. కాలుష్య నియంత్రణ లో భాగంగా సాద్యమైనంతవరకు విధ్యుత్ వాహనాలను ఉపయోగించాలన్నారు. కాలుష్య నియంత్రణకు జివిఎంసి విశేష కృషి చేస్తుందని, మొక్కలు సంరక్షణ, కార్యాలయంలోనికి ఉద్యోగుల వాహనాలు అనుమతించక పోవడం వంటి చర్యలు తీసుకున్నా మన్నారు.

# గీతం లో పర్యావరణ దినోత్సవం



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం ఆద్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేధవతి, ఫిజియో థెరిపి డైరక్టర్ డాక్టర్ ఖాశీమాధురి పాల్గొని గీతం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ మాట్లాడుతూ ఏటా ప్రపంచ వ్యాప్తంగా 400 మిలియన్ల టన్నుల ప్లాస్టిక్ వాడతుండగా అందులో 23 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రాలు, నదులు, చెఱువులలోకి చేరుతోందని ఆంధోళన వ్యక్తం చేసారు. ప్లాస్టిక్ వ్యర్థాలు విషతుల్యంగా మారి పర్యావరణానికి, జంతువులకు హానికరంగా పరిణమిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకొని ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. గీతం సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేధవతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రజలు ముందుకు రావాలని ప్లాస్టిక్ వాడకం మానివేయాలని సూచించారు. గీతం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పర్యావరణ శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ వి.సరిత, ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com